RNI-TELTEL/2017/72695

శుభ

తెలంగాణ

12 జూన్ 2021

శనివారం | మేడ్చల్

సంపుటి: 04 సంచిక: 102 పేజీలు - 06

వెల: 4 రూ/.

Website:
www.subhatelangana.in

Published From Medchal, Circulated at Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla, Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri,



బెంగాల్లో బిజెపికి

పెద్ద షాక్

తిరిగి తృణమూల్ గూటికి చేరిన ముకుల్ రాయ్

సొంతింటికి తిరిగి రావడం ఆనందంగా ఉందన్న మమతా బెనర్జీ




కోల్‌కతా,జూన్11 : బెంగాల్లో బిజెపికి పెద్ద షాక్ తగిలింది. బీజేపీ నేత ముకుల్ రాయ్ తిరిగి తృణమూల్ కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఆయనతో పాటు ఆయన కుమారుడు సుభ్రాంషు రాయ్ కూడా బీజేపీలో చేరారు. సీఎం మమతా బెనర్జీ సమక్షంలో ఆయన తిరిగి తృణమూల్‌లో చేరారు. ఈ సందర్భంగా సీఎం మమతా బెనర్జీ మాట్లాడుతూ... కుమారుడు తిరిగి

మిగతా 2లో...

నేడు ఎమ్మెల్యే పదవికి

ఈటల రాజీనామా

గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి అర్పించనున్న నేత



హైదరాబాద్,జూన్11 : మాజీ మంత్రి ఈటల రాజేందర్ శనివారం తన ఎమ్మెల్యే పదవి రాజీనామా చేయనున్నారు. ఉదయం గన్‌పార్క్ వద్ద అమరులకు నివాళి అర్పించి 11 గంటలకు ఎమ్మెల్యే పదవికి ఆయన రాజీనామా చేయనున్నారు. ఈ నెల 14న ఈటల బీజేపీలో చేరతారని ఇప్పటికే ఆ పార్టీ ముఖ్యనేతలు వెల్లడించిన సంగతి తెలిసిందే. శనివారం నాడు

మిగతా 2లో...



త్వరలో పల్లె, పట్టణ ప్రగతి పనుల

ఆకస్మిక తనిఖీలు

పల్లెలకు మహర్దశ

స్వయంగా తానే పర్యవేక్షించనున్న సీఎం కేసీఆర్

13న అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, డీపీఓలతో సమావేశం

19 నుండి తనిఖీలు నిర్వహించే అవకాశం

పల్లె ప్రగతి పై ప్రగతి భవన్ లో సీఎం ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్,జూన్11 : రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాల్లో జరుగుతున్న ప్రగతి తీరును, పంచాయతీ రాజ్, మున్సిపల్ శాఖ అధికారుల పనితీరును పరిశీలించేందుకు జూన్ 19 తర్వాత రాష్ట్రవ్యాప్తంగా ఆకస్మిక తనిఖీలను తానే స్వయంగా చేపడుతానని, ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు ప్రకటించారు. ఇందులో భాగంగా పల్లె ప్రగతి పట్టణ ప్రగతి కార్యక్రమాల క్షేత్రస్థాయి పనితీరును సమీక్షించడానికి జూన్ 13 న అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారుల(డీపీఓ) లతో ప్రగతి భవన్ లో సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నామని సీఎం తెలిపారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ముందస్తు చర్యలను సిద్ధం చేసుకునే చార్టును రూపొందించుకోవాలని, దానికి అనుగుణంగా ప్రతీ సీజన్లో ముందస్తు కార్యాచరణను చేపట్టే సంస్కృతిని ఆయా శాఖల ప్రభుత్వ యంత్రాంగం అభివృద్ధి చేసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో కరోనా తగ్గుముఖం పట్టిందని, రాష్ట్రంలో పాజిటివిటీ రేటు 4.7 శాతానికి పడిపోయిందని సీఎం తెలిపారు. కరోనా పూర్తిగా తగ్గిన తర్వాత, త్వరలో మరో విడత పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలను చేపడుతామని సీఎం తెలిపారు. రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచడానికి అటవీ శాఖ ప్రత్యేక కార్యాచరణను కొనసాగించాలని సీఎం ఆదేశించారు. శుక్రవారం ప్రగతి భవన్ లో పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి తీరు, అందుకనుగుణంగా అదనపు కలెక్టర్లు, డీపీఓలు సహా మున్సిపల్, పంచాయతీ రాజ్ సిబ్బంది పనితీరు, చేపట్టవలసిన చర్యలపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నూతన పంచాయతీ రాజ్, మున్సిపాలిటీ చట్టాలను అమల్లోకి తెచ్చి పల్లెలు, పట్టణాల అభివృద్ధికి దేశంలో ఎక్కడా లేనివిధంగా ప్రభుత్వం సహకారం అందిస్తున్నదని సీఎం అన్నారు. గ్రామాలకు, మున్సిపాలిటీలకు ఆర్థికంగా

మిగతా 3లో...

హైదరాబాద్‌లో సుప్రీం చీఫ్‌జస్టిస్ ఎన్వీ రమణకు

ఘనస్వాగతం

రాజ్‌భవన్‌లో స్వాగతం పలికిన గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్

పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన జస్టిస్ రమణ

హైదరాబాద్,జూన్11 :
సుప్రీం ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారిగా వచ్చిన జస్టిస్ ఎన్వి రమణకు హైదరాబాద్‌లో ఘన స్వాగతం లభించింది. తెలుగు తేజానికి సాదర స్వాగతం దక్కింది. రాజ్‌భవన్‌లో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కేసీఆర్ స్వాగతం పుష్పగుచ్ఛం అందించి పలికారు. అనంతరం ఎన్వీ రమణ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్‌గా ఎన్వీ రమణ పదవి బాధ్యతలు స్వీకరించిన తర్వాత మొదటిసారి హైదరాబాద్‌కు వచ్చారు. మూడు రోజులపాటు

మిగతా 3లో...

కాంతులీనుతున్న యాదాద్రి



పెట్రో ధరలపై భగ్గుమన్న

కాంగ్రెస్

ఆయా రాష్ట్రాల్లో ఆందోళనలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

మోడీ తీరుపై మండిపడ్డ కాంగ్రెస్ నేతలు

తక్షణం ధరల పెరుగుదలను ఆపాలని వినతి

జిఎస్టీ పరిధిలోకి పెట్రోల్‌ను తీసుకుని రావాలని డిమాండ్

పెట్రో వడ్డనతో ప్రజలను లూటీ చేస్తున్న మోడీ

న్యూఢిల్లీ/హైదరాబాద్,జూన్11 : పెట్రోల్ రేట్లు మండిపోతున్న తరుణంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ నిరసనలకు దిగింది. మోడీ అధికారంలోకి వచ్చాక ఎలా పెట్రో, గ్యాస్ ధరలను పెంచారో విమర్శించింది. గతంలో గుజరాత్ సిఎంగా ఉన్నప్పుడు పెట్రో ధరల పెరుగుదలను విమర్శించిన మోడీ ఇప్పుడు కరోనా సంక్షోభంలో సైతం రేట్లు పెంచడంపై

మిగతా 2లో...

దేశంలో అంతకంతకూ పెరుగుతున్న

బ్లాక్ ఫంగస్ కేసులు

వ్యాధిబారిన పడి ఇప్పటి వరకు 2,109 మంది మృత్యువాత



న్యూఢిల్లీ,జూన్11 : దేశంలో బ్లాక్ ఫంగస్ కేసులు రోజురోజుకు మరింతగా పెరిగిపోతున్నాయి. గత మూడు వారాల్లో ఇవి ఏకంగా 150 శాతం పెరిగి 31,216కు చేరుకున్నాయి. అలాగే దీని బారినపడి ఇప్పటి వరకు 2,109 మంది ప్రాణాలు కోల్పోయారు. కరోనా సెకండ్ వేవ్‌తో పోరాడుతున్న భారత వైద్య రంగంపై బ్లాక్ ఫంగస్ కేసులు మరింత ఒత్తిడి పెంచుతున్నాయి. కేసులు పెరుగుతుండడంతో

మిగతా 2లో...

అప్పులకుప్పగా

తెలంగాణ

భూముల అమ్మకంతో ఆస్తులకు నష్టం

ప్రజావసరాలకు ఉంచాల్సిన భూములు తెగనమ్ముతున్నారు

కేసీఆర్ తీరుపై మండిపడ్డ సీఎల్పీ నేత భట్టి



హైదరాబాద్,జూన్11 : ముఖ్యమంత్రి కేసీఆర్ తన విశృంఖల ఆర్థిక పాపాలను కప్పి పుచ్చుకునేందుకు వేలకోట్ల రూపాయల విలువైన ప్రభుత్వం భూములను అమ్మకానికి పెట్టారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆరోపించారు. జిల్లాకు వెయ్యి ఎకరాల చొప్పున దాదాపు 33 వేల ఎకరాల విలువైన ప్రభుత్వ భూములను తెగనమ్మడానికి సిద్ధమయ్యారని అన్నారు. అవి ప్రభుత్వ భూములు.. ప్రజల భూములు.. వాటిని ప్రజా అవసరాల కోసమో ఉపయోగించాలని, ప్రజావసరాలకోసం ఉపయోగపడే వాటిని కరగదీయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నానన్నారు. స్వాతంత్రం

మిగతా 2లో...

టీఆర్ఎస్ ఎంపి నామా ఇంట్లో

ఈడీ సోదాలు

నిధులు దారిమళ్లింపుపై ఆరా



హైదరాబాద్,జూన్11 : టీఆర్ఎస్‌కు ఈడీ షాకిచ్చింది. ఆ పార్టీ ఎంపీ నామా నాగేశ్వరరావు ఇంట్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఖమ్మంలోని ఆయన నివాసం, హైదరాబాద్‌లోని నామా నాగేశ్వరరావు కంపెనీ మధుకాన్ కార్యాలయంలో సోదాలు చేపట్టారు. రాంచీ ఎక్స్‌ప్రెస్ వే సీఎండీ కే శ్రీనివాస్ రావు, డైరెక్టర్లు ఎన్. సీతయ్య, ఎన్. పృథ్వీ తేజ నివాసంలోనూ తనిఖీలు చేశారు. మధుకాన్ కంపెనీ పేరుతో భారీగా లోన్లు తీసుకొని విదేశీ కంపెనీలు డబ్బులను మళ్లించినట్లు నామా నాగేశ్వరరావుపై అభియోగాలు వచ్చాయి. రూ.1064 కోట్ల మేర బ్యాంకులను

మిగతా 2లో...

కృష్ణా ట్రిబ్యునల్‌పై వెనక్కి తగ్గిన

తెలంగాణ

కేంద్రం హామీలో సుప్రీంలో కేసు ఉపసంహరణ



న్యూఢిల్లీ,జూన్11 : కృష్ణా ట్రిబ్యునల్ అవార్డుకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం రిట్ పిటిషన్‌ను సుప్రీం కోర్టులో దాఖలు చేసింది. కేంద్రం హామీ మేరకు రీట్ పిటిషన్

మిగతా 2లో...

జూరాలకు కొనసాగుతున్న

వరద

2లో

శ్రీశైలానికి పెరుగుతున్న నీటి రాక



బెంగాల్లో బిజెపికి

పెద్ద షాక్

మొదటిపేజీ తరువాయి..

సొంతింటికి చేరుకున్నాడు. ముకుల్ రాయ్ ఇంటి పిల్లవాడు. తిరిగి ఇంటికి వచ్చేశాడు. ఆయనను సాదరంగా పార్టీలోకి ఆహ్వానిస్తున్నాను. పార్టీలో చాలా ముఖ్యమైన పాత్రను పోషించబోతున్నారు.



బీజేపీలో చాలా దోపిడీ ఉంది. అందులో మనగలగడం ఇబ్బందే అని మమత వ్యాఖ్యానించారు. మరోవైపు కృష్ణా నగర్ శాసన సభ్యత్వానికి ముకుల్ రాయ్ రాజీనామా చేయనున్నట్లు సమాచారం. అక్కడి నుంచి ఆయన కుమారుడు సుభ్రాంషు రాయ్ బరిలోకి దిగుతున్నట్లు సమాచారం. అయితే తృణమూల్‌లోకి రాక మునుపు ముకుల్ రాయ్ నాలుగు సార్లు సీఎం మమతతో ఫోన్లో చర్చించారు. లెక్క ప్రకారం ఎన్నికల కంటే ముందే ముకుల్ తృణమూల్‌లో చేరిపోవాలని భావించారు. బీజేపీ అధ్యక్షుడు దిలీప్ ఘోష్‌తో ఆయనకు పొసగక పోవడమే ఇందుకు కారణం. అయినా, కొన్ని రోజుల పాటు ముకుల్ బీజేపీలోనే ఉండిపోయారు.

నేడు ఎమ్మెల్యే పదవికి

ఈటల రాజీనామా

మొదటిపేజీ తరువాయి..

మొదట.. నగరంలోని గన్‌పార్క్ దగ్గర అమరవీరుల స్థూపానికి ఈటల నివాళులు అర్పించనున్నారు. అనంతరం అసెంబ్లీలోని స్పీకర్ కార్యాలయానికి వెళ్లి రాజీనామా పత్రాన్ని సమర్పించనున్నారు. స్పీకర్ అపాయింట్‌మెంట్ కోరినా సమాధానం లేకపోవడంతో కార్యాలయంలో రాజీనామా లేఖను అందచేస్తారు. ఈ నెల 14న ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా సమక్షంలో కాషాయ కండువా కప్పుకోనున్నారు. ఈటలతో పాటు ముఖ్యనేతలు ఏనుగు రవీందర్ రెడ్డి, తుల ఉమతో పాటు మరికొంతమంది నేతలు బీజేపీ తీర్థం పుచ్చుకొనున్నారు. ఇప్పటికే ఢిల్లీకి వెళ్లేందుకు ప్రత్యేక విమానం ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది.

దేశంలో అంతకంతకూ పెరుగుతున్న

బ్లాక్ ఫంగస్ కేసులు

మొదటిపేజీ తరువాయి..

దీని చికిత్సకు ఉపయోగించే యాంఫోటెరిసిన్-బి డ్రగ్‌కు విపరీతమైన కొరత ఏర్పడింది. మహారాష్ట్రలో 7,057 బ్లాక్ ఫంగస్ కేసులు వెలుగు చూడగా, 609 మంది మరణించారు. ఆ తర్వాతి స్థానంలో గుజరాత్ ఉంది. ఇక్కడ 5,418 మంది ఈ బ్లాక్ ఫంగస్ బాధితులుగా మారగా, 323 మంది మృతి చెందారు. బ్లాక్ ఫంగస్ కేసుల్లో రాజస్థాన్‌ది మూడోస్థానం. ఇక్కడ 2,976 కేసులు నమోదు అయ్యాయి. అయితే, కరోనా మరణాల్లో మాత్రం కర్ణాటక మూడో స్థానంలో నిలిచింది. ఈ రాష్ట్రంలో ఇప్పటి వరకు 188 మంది బ్లాక్ ఫంగస్‌తో మృతి చెందారు. మహారాష్ట్రలో మే 25న ఒకే రోజు 2,770 బ్లాక్ ఫంగస్ కేసులు నమోదు కాగా, గుజరాత్‌లో 2,859 కేసులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్, ఢిల్లీ, ఝార్ఖండ్‌లోనూ కేసులు పెద్ద ఎత్తున నమోదవుతున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో మాత్రం అతి తక్కువగా 23 మంది బ్లాక్ ఫంగస్‌తో మృతి చెందారు.

కృష్ణా ట్రిబ్యునల్‌పై వెనక్కి తగ్గిన

తెలంగాణ

మొదటిపేజీ తరువాయి..

ఉపసంహరించుకోవాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సుప్రీం కోర్టులో ఉపసంహరణకు దరఖాస్తు చేసింది. విభజనకు ముందు మహారాష్ట్ర, కర్ణాటక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కృష్ణట్రిబ్యూనల్ నీటి కేటాయింపులు జరిపిన విషయం తెలిసిందే. కాగా నీటి కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగిందని సుప్రీం కోర్టులో తెలంగాణ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. కృష్ణ నదిజలాలు నాలుగు రాష్ట్రాలకు సమాన వాటా అందించేలా సుప్రీం కోర్టు చూడాలని తెలంగాణ ప్రభుత్వం పిటిషన్‌లో డిమాండ్ చేసింది. పిటిషన్ ఉపసంహరణకు మళ్లీ కృష్ణట్రిబ్యూనల్‌కు కొత్త విధివిధానాలు రూపొందిస్తామని కేంద్రం స్పష్టం చేయడంతో తెలంగాణ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

తెలంగాణలో క్రమంగా తగ్గుతున్న కరోనా ఉధృతి

కొత్తగా 1,707 కరోనా కేసులు.. 16 మరణాలు
6 లక్షలు దాటిన కోవిడ్ కేసులు

హైదరాబాద్ : తెలంగాణలో కరోనా ఉధృతి క్రమంగా తగ్గుతున్నది. గడిచిన 24 గంటల వ్యవధిలో కొత్తగా 1,707 పాజిటివ్ కేసులు



నమోదయ్యాయి. వైరస్ బారినపడిన వారిలో 2,493 మంది చికిత్సకు కోలుకొని డిశ్చార్జి అయ్యారు. 16 మంది ప్రాణాలు కోల్పోయారు. రాష్ట్రంలో మొత్తం పాజిటివ్ కేసులు 6,00,318కి పెరిగాయి. వీరిలో 5,74,103 మంది చికిత్సకు కోలుకున్నారు. ఇంకా 22,759 యాక్టివ్ కేసులున్నాయి. ఇవాళ్టి వరకు మొత్తం 3,456 మంది మృతి చెందారు. రాష్ట్రవ్యాప్తంగా 1,24,066 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించినట్లు వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.

సంగమేశ్వర పనులు 14కి వాయిదా

హైదరాబాద్,జూన్11 : సంగారెడ్డి, జహీరాబాద్, ఆందోల్ నియోజకవర్గాలకు నీరందించే సంగమేశ్వర లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు సర్వే పనులను ఈ నెల 12వ తేదీన ప్రారంభించాల్సి ఉండగా 14వ తేదీకి వాయిదా పడ్డాయి. సర్వే పనులు 14 వ తేదీకి వాయిదా పడింది. మంత్రి హరీశ్ రావు జీఎస్టీ కౌన్సిల్ సమావేశం ఉన్నందున శనివారం నాటి సంగమేశ్వర లిఫ్ట్ సర్వే ప్రారంభ కార్యక్రమం వాయిదా పడింది. కాగా, జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో మంత్రి హరీశ్ రావు కీలక పాత్ర పోషిస్తున్న విషయం తెలిసిందే. ఈ సమావేశంలో తప్పనిసరిగా పాల్గొనాల్సి ఉన్నందున పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని వాయిదా వేశారు. ఈ నెల 14 తేదీన సోమవారం 11 గంటలకు అదే ప్రాంతంలో మంత్రి హరీశ్ రావు సర్వే పనులను ప్రారంభిస్తారని అందోల్ ఎమ్మెల్యే చంద్రి క్రాంతి కిరణ్ ఒక ప్రకటనలో తెలిపారు.



జూరాలకు కొనసాగుతున్న

వరద

శ్రీశైలానికి పెరుగుతున్న నీటి రాక

మహబూబ్‌నగర్,జూన్11 : జోగులాంబ గద్వాల జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతున్నది. ఎగువన కర్ణాటకలో ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు గేట్లకు మరమ్మతులు చేస్తున్నారు. దీంతో దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో గత రెండు రోజులుగా జూరాల ప్రాజెక్టులోకి నీరు వచ్చి చేరుతున్నది. ప్రాజెక్టులో ప్రస్తుతం 318.400 మీటర్ల వరకు నీరు మట్టం ఉన్నది. దీంతో నీటి నిల్వ 9.418 టీఎంసీలకు చేరింది. డ్యాం పూర్తిస్థాయి నీటిమట్టం 318.516 మీటర్లు కాగా, నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 15,600 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతున్నది. 20,809 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఇందులో విద్యుత్ ఉత్పత్తి ద్వారా నదిలోకి 17,264 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

దీంతో శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం వస్తున్నది. ఎగువ పరీవాహక ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. దీంతో ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరుతోంది. ఎగువనున్న జూరాల ప్రాజెక్ట్ నుంచి 17,264 క్యూసెక్కులు, సుంకేసుల జలాశయం నుంచి 3,309 క్యూసెక్కుల ప్రాజెక్టులోకి వస్తోంది.

శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 809.02 అడుగులు మేర నీరుంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 215.8070 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 33.8613 టీఎంసీల నీరుంది. కుడి గట్టు, ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల్లో కరెంటు ఉత్పత్తి ప్రస్తుతం నిలిచిపోయింది. ఇకపోతే సంగారెడ్డి జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు సింగూరు ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చి చేరుతున్నది. ఎగువ నుంచి వరదలతో ప్రాజెక్టులోకి 5972 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నది. ప్రస్తుతం జలాశయంలో 17.001 టీఎంసీల నీటిమట్టం ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 29.91 టీఎంసీలు.

పెట్రో ధరలపై భగ్గుమన్న

కాంగ్రెస్

మొదటిపేజీ తరువాయి..

పార్టీ శ్రేణులు మండిపడ్డాయి. బిజెపికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటాయి. దేశీయ చమురు కంపెనీలు ఎడాపెడా ధరలను పెంచుతూ పోతున్నాయి. ఇప్పటికే కరోనాతో ఆర్థికంగా ఇబ్బందులను ఎదుర్కొంటున్న జనాలు పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో మరింత ఆందోళనకు గురవుతున్నారు. రెండు రోజుల విరామం తర్వాత పెట్రో కంపెనీలు పెట్రోల్‌పై 29 పైసలు, డీజిల్‌పై 28 పైసల చొప్పున పెంచాయి. దీంతో రాష్ట్రంలోని జగిత్యాలలో పెట్రోల్ ధర వంద మార్కును దాటింది. ప్రస్తుతం జగిత్యాలలో లీటర్ పెట్రోల్ రూ.100.34, డిజిల్ రూ.95.23గా ఉన్నాయి. ఇక హైదరాబాద్‌లో పెట్రోల్ రూ.99.61, డీజిల్ రూ.94.56కు చేరాయి. ఈ నెలలో ఇప్పటి వరకు ఆరు సార్లు ఇంధన ధరలుపెరిగాయి. ఇక ఐదు రాష్ట్రాల్లో ఫలితాలు వెలువడిన తర్వాత అంటే మే 4 నుంచి ఇప్పటివరకు 23 సార్లు చమురు కంపెనీలు ధరలను పెంచాయి. ఆకాశమే హద్దుగా పెరుగుతున్న ఇంధన ధరలతో సామాన్యులు పెట్రోల్ బంకులకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. దేశవ్యాప్తంగా చాలా నగరాల్లో లీటర్ పెట్రోల్ ధర రూ.100 మార్క్‌ను దాటగా.. డీజిల్ సైతం రూ.100 వైపు పరుగులు పెడుతున్నది. దేశంలోనే అత్యధికంగా రాజస్థాన్‌లోని శ్రీగంగానగర్‌లో లీటర్ పెట్రోల్ రూ.106, డీజిల్ రూ.99గా ఉన్నాయి.

కేంద్రంలో భాజపా నేతృత్వంలోని ఎన్డీయే, రాష్ట్రంలో తెరాస ప్రభుత్వాల కారణంగా లీటర్ పెట్రోల్ ధర రూ.100కు చేరిందని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ఈ ఏడాదిలోనే పెట్రోల్‌పై రూ.25, డీజిల్‌పై రూ.24 పెరిగిందని చెప్పారు. పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గించాలంటూ ఏఐసీసీ పిలుపు మేరకు తెలంగాణ వ్యాప్తంగా పలుచోట్ల కాంగ్రెస్ పార్టీ ఆందోళనలకు దిగింది. నేతలు, కార్యకర్తలు పెట్రోల్ బంకుల వద్ద బైఠాయించి నిరసన తెలిపారు. హైదరాబాద్ ట్యాంక్ బండ్ వద్ద చేపట్టిన కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో పాటు నేతలు పొన్నాల లక్ష్మయ్య, అంజన్‌కుమార్ యాదవ్, దాసోజు శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడారు. అంతర్జాతీయంగా చమురు ధరలు తగ్గుతుంటే ఇక్కడ మాత్రం ఎక్సైజ్ సుంకం, వ్యాట్‌లను భారీగా పెంచారని విమర్శించారు. చమురు ధరలపై రాష్ట్ర పన్నును తెరాస ప్రభుత్వం కాంగ్రెస్ శ్రేణులు పెట్రోల్ బంకుల వద్ద నిరసనలు తెలుపుతున్నారు. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేస్తున్నారు. ఒకవైపు కరోనా ప్రజల జీవితాలతో ఆడుకుంటుంటే మరోవైపు కేంద్ర ప్రభుత్వం ధరలను పెంచేస్తూ మరింత ఇబ్బందుల్లోకి



నెట్టేస్తోందని చెప్పారు. ఘట్‌కేసర్‌లో ఎంపీ రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ నిరసన తెలుపుతోంది. హైదరాబాద్-వరంగల్ రహదారి పక్కన ఉన్న పెట్రోలు బంకు వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్నారు. హైదరాబాద్‌లో ఉత్తమ్ కుమార్ కుమార్ రెడ్డి, పొన్నాల లక్ష్మయ్య, అంజన్ కుమార్, దాసోజు శ్రవణ్ నిరసనలో పాల్గొన్నారు. జగిత్యాలలో ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి నేతృత్వంలో ఆందోళనలు తెలుపుతున్నారు. జీవన్ రెడ్డితో పాటు కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోజు రోజుకూ ఇంధన ధరలు పెరుగుతున్న విషయం తెలిసిందే. పెట్రోల్, డీజిల్ ధరలు అదుపులేకుండా పెరుగుతున్నాయి. కొన్ని రాష్ట్రాలు, నగరాల్లో లీటరు పెట్రోల్ ధర వంద దాటింది. ఒకవైపు కరోనా తరుముతుంటే.. మరో వైపు ఇంధన ధరలు చుక్కలనంటుతున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త నిరసనలకు ప్రజల నుంచి కూడా మద్దతు లభించింది. పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలని కోరుతూ పార్టీ నేతలు, కార్యకర్తలు వివిధ



రాష్ట్రాల్లో ఆందోళనలో పాల్గొన్నారు. మహమ్మారి వేళ కూడా బీజేపీ ప్రభుత్వం ప్రజలను దోచుకుంటోందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఢిల్లీలో సీనియర్ నేత కేసీ వేణుగోపాల్.. నిరసన ప్రదర్శనలో పాల్గొన్నారు. యూపీఏ అధికారంలో ఉన్న సమయంలో.. పెట్రోల్, డీజిల్‌పై పన్ను కేవలం 9.20 మాత్రమే ఉండేదని, కానీ ఇప్పుడు అది రూ.32కు చేరినట్లు ఆయన తెలిపారు. పెట్రోల్, డీజిల్ పై పెరిగిన ఎక్సైజ్ సుంకాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంధన ధరలను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలని కేసీ వేణుగోపాల్ కోరారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ జిల్లాలో కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగారు. అడ్డూఅదుపూ లేకుండా రోజురోజుకూ పెరిగిపోతున్న పెట్రోల్, డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ శుక్రవారంనాడు దేశవ్యాప్త నిరసనలు నిర్వహించింది. కాంగ్రెస్ కార్యకర్తలు ప్లకార్డులతో, కేంద్రానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఈ నిరసనల్లో పాల్గొన్నారు. ఢిల్లీలో జరిగిన ఆందోళనలో కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, దేశంలోని సామాన్య ప్రజలను మోదీ ప్రభుత్వం లూటీ చేయడం మానాలని అన్నారు. గత ఐదు నెలల్లో ఇంధనం ధరలు 44 రెట్లు పెరిగాయని పేర్కొన్నారు. ఒకవైపు కోవిడ్ మహమ్మారితో ప్రజలు బాధపడుతుండే, మరో వైపు కేంద్రం ఇంధనం ధరలు పెంచుకుండా పోతోందని, పేద ప్రజల ఖాతాల్లోకి నేరుగా రూ.6,000 చొప్పున కేంద్రం జమ చేయాలని తాము కోరుతున్నామని అన్నారు. ఇంధనం ధరలపై ఎక్సైజ్ డ్యూటీ అనేక సార్లు పెంచుకుంటూ పోవడం వల్ల 250కి పైగా నగరాల్లో పెట్రోల్ ధర లీటరు రూ.100 దాటిపోయిందని పేర్కొన్నారు. కేంద్రం సెట్రల్ విస్తా ప్రాజెక్టు నిర్మాణంలో బిజీగా ఉంది. యూపీఏ అధికారంలో ఉన్నప్పుడు పెట్రోల్, డీజిల్‌పై పన్ను రూ.9.20గా ఉంది. ఇప్పుడది రూ.32 అయింది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ డ్యూటీ పెంపును పూర్తిగా ఉపసంహరించుకోవాలి. జీఎస్టీ పరిధిలోకి ఇంధనాన్ని తీసుకురావాలి' అని వేణుగోపాల్ అన్నారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో కాంగ్రెస్ నిరసనలకు ఆ పార్టీ సీనియర్ నేత దిగ్విజయ్ సింగ్ సారథ్యం వహించారు. ఎక్సైజ్ డ్యూటీని కనీసం 25 శాతం తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఇంధనం ధరల పెంపుపై ఒకప్పుడు యూపీఏ సర్కార్‌పై నోరు పారేసుకున్న వాళ్లంతా ఇప్పుడు ఎక్కడకు పోయారని ఆయన నిలదీశారు. ఇంధనం ధరలు పెరుగుతూ పోతుండటంతో నిత్యావసరాల ధరలు కొండొక్కుతున్నాయని పేర్కొన్నారు. కాగా, పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో కాంగ్రెస్ వర్కర్లు వినూత్న నిరసన తెలిపారు. ఒక తుక్కుకారును ఎద్దుల బండిపై ఉంచి నిరసన ప్రదర్శన నిర్వహించారు. అటు, చెన్నైలోని కీల్పాక్‌లోనూ తమిళనాడు కాంగ్రెస్ అధ్యక్షుడు కేఎస్ అళగిరి సారథ్యంలో పార్టీ కార్యకర్తలు నిరసనల్లో పాల్గొన్నారు. హన్మకొండలోని నక్కలగుట్ట ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ వద్ద ఆందోళన చేపట్టారు. ఏఐసీసీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు నిరసన తెలపనున్నారు. పెట్రోల్, డిజిల్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. నాయిని రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిరసన చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ శ్రేణులు నినాదాలు చేసారు. బీజేపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాలు ధరలు పెంచడంలో బెస్ట్ ర్యాంక్‌లో ఉన్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు నిరసనకు దిగారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత పాలకులు, గతపాలకులు అంటూ పబ్బం గడుపుతున్నారు....మా ప్రభుత్వం ఉన్నప్పుడు ఇలా రేట్ పెంచలేదని అన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయని తెలిపారు. హుజూరాబాద్‌లో వరాలు ఇవ్వటం తప్ప చేసిందేమి లేదని మండిపడ్డారు. పెంచిన గ్యాస్, పెట్రోల్, డిజిల్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇలానే వ్యవహరిస్తే కాంగ్రెస్ పార్టీ మరో ఉద్యమం చేస్తుందని నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. నిత్యం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుపేదల నడ్డి విరుస్తున్నాయని కాంగ్రెస్ మల్కాజ్‌గిరి ఎంపీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రేవంత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, సీఎం కేసీఆర్ పెట్రో రేట్లు పెంచుతూ పేదలను నిలువు దోపిడి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరోనా సంక్షోభంతో ఏడాది నుంచి లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని చెప్పారు. 10 నెలల కాలంలో పెట్రోల్‌పై రూ.25, డీజిల్‌పై 26 పెంచారని రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. కరోనా సంక్షోభంలో పేదలను ఆదుకోవాల్సింది పోయి దోచుకుంటున్నారన్నారు. ఢిల్లీలో మోదీ, గల్లీలో కేడీ ఇద్దరు కలిసి లీటర్ 35 రూపాయలకు రావాల్సిన పెట్రోల్ నూరు రూపాయలకు అమ్ముతున్నారని ధ్వజమెత్తారు. ఇందులో రూ.33 మోదీ, రూ.32 కేసీఆర్ పన్నుల పేరిట వసూలు చేస్తున్నారన్నారు. పెట్రోల్, డీజిల్ ధర పెరిగితే ఆ ప్రభావం రవాణా రంగంపై ఉంటుందన్నారు. మోదీ ఏడేళ్ల పాలనలో అచ్చేదిన్ రాలేదు... సచ్చేదిన్ వచ్చిందని ఎద్దేవా చేశారు. పెట్రో ధరలు పెరగడంతో నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

టీఆర్ఎస్ ఎంపి నామా ఇంట్లో ఈడీ సోదాలు

మొదటిపేజీ తరువాయి..

మోసం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలోనే నామా నివాసంతో పాటు కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ లోన్‌కు నామా నాగేశ్వరరావు పర్సనల్ గ్యారంటీర్‌గా ఉన్నారు. రాంచీ ఎక్స్‌ప్రెస్ వే డైరెక్టర్‌గా ఉన్న పృథ్వీ తేజ నామా నాగేశ్వరరావు తనయుడు. వీరి ఇళ్లల్లో ఏకకాలంలో ఈడీ సోదాలు చేస్తున్నారు. కంపెనీ అకౌంట్లు, డాక్యుమెంట్లు, కాంట్రాక్టులకు సంబంధించిన వివరాలను విశ్లేషిస్తున్నారు.2011లో ఎన్ హెచ్-33 పరిధిలోని రాంచీ-జంషెడ్‌పూర్ రోడ్డు నిర్మాణ పనులను మధుకాన్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్‌కు ఎన్ హెచ్ ఏఐ అప్పగించింది.

163 కి.మీ. రోడ్డు నిర్మాణం కోసం రాంచీ ఎక్స్‌ప్రెస్ వే పేరిట పనులను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు కెనరా బ్యాంక్ నేతృత్వంలో పలు బ్యాంకులు రూ.1151 కోట్ల రుణాలు ఇచ్చేందుకు ముందుకొచ్చాయి. ఆ నిధులను రాంచీ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణం కోసం వినియోగించాలి. కానీ పక్కదారి పట్టించి.. విదేశాలకు తరలించారన్న ఆరోపణలున్నాయి. ఈ క్రమంలోనే మధుకాన్ కంపెనీపై సీబీఐ మనీలాండరింగ్ కేసు నమోదయింది. ఏళ్లు గడిచినా రోడ్డు నిర్మాణంలో ఎలాంటి పురోగతి లేదని సీబీఐ ఆరోపించింది. రూ.1029 కోట్ల బ్యాంకు రుణాలు దుర్వినియోగం అయ్యాయని గుర్తించింది. బ్యాంకులు మంజూరు చేసిన లోన్ నాన్ ఫర్మామింగ్ అసెట్(నిరర్థక ఆస్తులు)గా మారిందని 2018లో సీబీఐ వెల్లడించింది. అనంతరం 2019లో మధుకాన్ కంపెనీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. సీబీఐ కేసు నమోదు కావడంతో 2019లో రాంచీ ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణ బాధ్యత నుంచి ఈ కంపెనీని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా తొలగించింది. ఇక 2020లో రాంచీ ఎక్స్‌ప్రెస్ వే లిమిటెడ్ సంస్థ డైరెక్టర్లపై సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసింది. మధుకాన్ ప్రాజెక్ట్స్, మధుకాన్ ఇన్‌ఫ్రా, మధుకాన్ టాలీ హైవే కంపెనీతో పాటు రుణాలు ఇచ్చిన బ్యాంకుల కన్సార్సియం ఆడిటర్లు, అధికారుల పేర్లను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా నామా నాగేశ్వరావు నివాసం, మధుకాన్ కంపెనీ కార్యాలయం, డైరెక్టర్ల ఇళ్లల్లో సోదాలు చేయడం హాట్ టాపిక్‌గా మారింది.

ఆగస్ట్‌లో తెలంగాణ ఎంసెట్!!

కసరత్తులో ఉన్నతవిద్యా శాఖ అధికారులు

హైదరాబాద్,జూన్11 : ఆగస్ట్ మొదటి వారంలో తెలంగాణలో



ఎసెంట్ పరీక్షలు జరిగే అవకాశముందని తెలుస్తోంది. జూలై 5 నుంచి 9 వరకు జరిగే పరీక్షలను ఆగస్ట్ మొదటి వారంలో నిర్వహించే అవకాశం ఉంది. ఎసెంట్ గడువు పెంపుపై రెండు మూడు రోజుల్లో ఉన్నత విద్యామండలి నిర్ణయం తీసుకోనుంది. ఇంటర్ పరీక్షల రద్దుతో ఎంసెట్ నిర్వాహణపై విద్యార్థులు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు. పరీక్షలు ముగిసిన నాటి నుంచి ఎంసెట్ ప్రిపరేషన్‌కు ఆరువారాల గడువు ఇవ్వడం ఆనవాయితీగా మారింది. ఎసెంట్ పరీక్ష లేకుండా విద్యార్థులకు ఇంజనీరింగ్, మెడికల్ సీట్లు కేటాయింపు చేయడం అసాధ్యమని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి. వరుసగా పరీక్షల రద్దుతో మెరిట్ స్టూడెంట్లు నష్టపోతారని అధికారులు చెబుతున్నారు. విద్యార్థులు ఎంసెట్ పరీక్షలకు ప్రిపేర్ అవ్వడం మంచిదని అధికార వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు ఎంసెట్‌కు 2,20027 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 15న ఎసెంట్ దరఖాస్తు గడువు ముగియనుంది.

అప్పులకుప్పగా
తెలంగాణ

మొదటిపేజీ తరువాయి..

వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ ప్రభుత్వాలు ఉమ్మడి రాష్ట్రంలోనూ.. ప్రభుత్వ భూములను కాపాడుకుంటూ విలువైన ఆస్తులను ప్రజల కోసం సృష్టించాయి. అంతేకాక ప్రజా అవసరాల కోసమే ప్రభుత్వ భూములను వినియోగించాయని గుర్తు చేశారు. తెలంగాణ భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడే 33 వేల ఎకరాల ప్రభుత్వ భూములను అమ్ముకుని సొమ్ము చేసుకునేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రాన్ని రూ. 15వేల కోట్ల మిగుల బ్జడెట్ తో ఏర్పాటు చేసింది. ఆ మిగులు బ్జడెట్ సొమ్ము, అప్పులు తెచ్చిన రూ.4 లక్షల కోట్ల డబ్బు, మొత్తంగా కాళేశ్వరం, మిషన్ భగీరథ పేరుతో కాజేసి.. ఇప్పుడు భూములమీద కేసీఆర్ పడ్డారు. ప్రభుత్వ భూములను కాపాడుకోలేక వాటిని అమ్ముతున్నామని.. అవి నిరర్ధక ఆస్తులని సిగ్గులేకుండా కేసీఆర్ మాట్లాడతున్నారు. ఇంత పెద్ద ప్రభుత్వం ఉండి.. భూములను కాపాడుకోలేమని చేస్తున్న వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. భూములను కాపాడలేని వ్యక్తులను తెలంగాణ ప్రజలను ఎలా కాపాడతారని ఆయన ప్రశ్నించారు. అప్పుచేసి పప్పుకూడులా కేసీఆర్ పాలన చేస్తున్నాడు. ఆస్తులు అమ్మి, భూములు అమ్మి.. అప్పులు తెచ్చి.. చివరకు టోటల్ గా తెలంగాణను కూడా కేసీఆర్ అమ్మేస్తాడు. ప్రభుత్వపరంగా రెసిడెన్షియల్ స్కూల్స్ కు, ఆసుపత్రులకు, వివిధ ప్రజావసరాలకు భూములు దొరక్క ఇబ్బందులు పడుతుంటే.. అరకొరగా ఉన్న భూములను పేలాలపిండి నాకేసినట్లు నాకేస్తే రాష్ట్రం ఏమవ్వాలి.. తెలంగాణ ప్రజలారా ఒక్కసారి ఆలోచించండి.. జాగృతం కండి.. మన రాష్ట్రాన్ని, మనల్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. భవిష్యత్ తరాలకు అప్పులను, ఆస్తులు లేని తెలంగాణను ఇచ్చే దౌర్భాగ్య పరిస్థితికి కేసీఆర్ పథక రచన చేస్తున్నాడు. ఈ రాష్ట్రం మనది... దీనిని మనమే కాపాడుకోవాలి. ఈ అమ్మకాలను అడ్డుకోవాలని తెలంగాణ ప్రజలకు నేను పిలుపునిస్తున్నానని భట్టి పేర్కొన్నారు.

తెలంగాణ ఆత్మాభిమానానికి, అహంకారానికి మధ్య పోటీ

బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ ఛుగ్

హైదరాబాద్,జూన్11 : రాష్ట్రంలో తెలంగాణ ఆత్మాభిమానానికి.. ఒక వ్యక్తి అహంకారానికి మధ్య పోరాటం జరుగుతోందని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ ఛుగ్ అన్నారు. కేసీఆర్ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా ఈటల రాజేందర్ గళం విప్పారని ఆయన పేర్కొన్నారు. పార్టీలో ఉన్నప్పుడే కాదు.. సమాజంలోనూ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా రాజేందర్ గళం విప్పారని ఆయన గుర్తు చేశారు. రాష్ట్రంలో బీజేపీని బలోపేతం చేసే దిశలో భాగంగా ఆయన శుక్రవారం హైదరాబాద్‌లో పర్యటించారు. పార్టీ నేషనల్ ఆర్గనైజింగ్ జాయింట్ సెక్రెటరీ జనరల్ శివప్రకాశ్‌తో కలసి వచ్చారు. తొలుత బీజేపీ రాష్ట్ర ముఖ్య నేతలు, ఎమ్మెల్యేలు రాజాసింగ్, రఘునందన్ రావు, మాజీ ఎంపీలు వివేక్ వెంకటస్వామి, జితేందర్ రెడ్డి, విజయశాంతి తదితరులతో సమావేశమై చర్చించారు. అనంతరం షామీర్ పేటలోని మాజీ మంత్రి ఈటెల నివాసానికి వెళ్లి కలిశారు. తమ భేటీ అధికారికమేనని తరుణ్ ఛుగ్ స్పష్టం చేశారు. ఈటల రాజేందర్ గళం తెలంగాణ సమాజ మనోగతం అని అయితే నియంతృత్వ పోకడతో ఆ గళాలను అణచివేస్తున్నారని ఆయన ఆరోపించారు. తెలంగాణలో కుటుంబ పాలన, ఓ వ్యక్తి అహంకారం, నియంతృత్వం తొలగిపోవాలని, ప్రజల మాట వినాలన్నారు. దీని కోసం తెలంగాణ నుంచి ఎంతమంది వచ్చినా బీజేపీ తరపున స్వాగతిస్తామని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి, గౌరవం, అవినీతి రహిత పాలన ఉండాలన్నదే బీజేపీ అభిమతం అని బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్ తరుణ్ ఛుగ్ స్పష్టం చేశారు.

పల్లెలకు మహర్దశ

మొదటిపేజీ తరువాయి..



అందదండలందిస్తూ ఉద్యోగుల భర్తీ చేపట్టి ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తున్నదన్నారు. ప్రతినెలా గ్రామాల అభివృద్ధికోసం, రూ. 339 కోట్లు, మున్సిపాలిటీల అభివృద్ధి కోసం 148 కోట్ల రూపాయలను క్రమం తప్పకుండా విడుదల చేస్తున్నదన్నారు. పంచాయతీ రాజ్ వ్యవస్థలో కింది నుంచి పై స్థాయి వరకు సిబ్బందిని ప్రభుత్వం పూర్తి స్థాయిలో నియమించిందని సీఎం గుర్తు చేసారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు సత్ఫలితాలనిస్తున్నాయని, ఇంకా చేరుకోవాల్సిన లక్ష్యాలు మిగిలే వున్నాయని సీఎం తెలిపారు. నిర్దేశిత బాధ్యతలను నిర్వర్తించడంలో పంచాయతీ రాజ్ ఉద్యోగులు, అధికారులు ఎందుకు వైఫల్యం చెందుతున్నారో తెలుసుకోవాల్సివున్నదని అన్నారు. తాత్సారం జరిగినట్టు నిర్లక్ష్యంతో వ్యవహరించినట్టు తన పర్యటన లో గుర్తిస్తే ఎవరినీ క్షమించబోనని సీఎం స్పష్టం చేశారు.

ఇప్పటివరకు గ్రామాలు, మున్సిపాలిటీలల్లో ఎంత వరకు ఏమేమి పనులు జరిగాయో ఒక చార్టును రూపొందించాలని సీఎస్ ను ముఖ్యమంత్రి ఆదేశించారు. పల్లె ప్రగతి చార్టును, పట్టణ ప్రగతి చార్టును వేరు వేరుగా రూపొందించాలన్నారు. గ్రామాలు, పట్టణాల్లో జరుగుతున్న ప్రగతిలో భాగంగా పారిశుధ్యం, పచ్చదనం, మంచినీటి సరఫరా, రోజువారీ పరిశుభ్రత, మొక్కల స్థితి, మొక్కలు బతికిన శాతం, గ్రామసభలు నిర్వహించిన తీరు, స్థానిక ఎంపీటీలు పాల్గొన్నతీరు, అందులో వారు గ్రామ ప్రగతి కోసం తీసుకున్న చర్యలు, ఎన్నిసార్లు గ్రామ సభలు నిర్వహించారు, గ్రామ ప్రగతి నివేదికల మీద జరిగిన చర్చల సారాంశం వంటి అంశాలను చార్టులో పొందుపర చాలన్నారు. వాటితో పాటు, చెత్తసేకరణ, దంపుయార్డులు, వైకుంఠధామాల నిర్మాణ స్థితి, బోరుబావులు పూడ్చడం, ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుధ్య నిర్వహణ, ట్రాక్టర్ల కిస్తులు కడుతున్నతీరు, కరెంటు బిల్లుల వసూలు, గ్రామ పంచాయితీ ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం, డ్రైనేజీలు, నాలాలు క్లీనింగ్, వెజ్ నాన్ వెజ్ మార్కెట్ల నిర్మాణం, వంటి అంశాలను చేర్చాలన్నారు. వాటితో పాటు ఉత్తమ గ్రామాలను, మండలాలను, అధ్వానంగా ఉన్న గ్రామాలు మండలాలను.. గుర్తించడం వాటికి గల కారణాలను ఈ చార్టులో ప్రత్యేకంగా పేర్కొనాలని సీఎం ఆదేశించారు. అన్ని రకాల అంశాలను పొందుపరిచి వాటిల్లో జరుగుతున్న పురోగతినే కాకుండా వెనుబాటు ను కూడా చార్టు రూపంలో సిద్ధం చేయాలని మంచి చెడులను రెండింటిని ప్రాతిపదికగా తీసుకుని చార్టును తయారు చేసి, ఆకస్మిక తనిఖీ పర్యటనలో తనకు అందచేయాలని సీఎస్ ను ఆదేశించారు.

సీజనల్ వ్యాధులను ముందస్తుగానే అరికట్టేందుకు గ్రామాల్లో ఇకనుంచి సీజన్ వారీగా చార్ట్ తయారు చేయాలని సీఎం అధికారులకు సూచించారు. వానాకాలం సహా శీతాకాలం, ఎండాకాలం మూడు కాలాల్లో వ్యాప్తిచెందే వ్యాధులను గుర్తించి వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను చార్టు రూపంలో రూపొందించుకోవా లన్నారు. ప్రతి సంవత్సరమూ సీజన్ రాకముందే సంబంధిత వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... "గ్రామాలను, పట్టణాలను పరిశుభ్రంగా పచ్చదనంతో నిర్వహించుకోవడంకన్నామించిన పని ప్రభుత్వానికి లేదు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాలు విజయవంత మయ్యాయి. అందులో సందేహం లేదు. అయితే పల్లెలు, పట్టణాలల్లో పారిశుధ్యం పచ్చదనాన్ని పెంచే కార్యక్రమాలను నిత్యం కొనసాగించాలె. అది నిరంతర ప్రక్రియ. ఈ క్రమంలో పంచాయతీరాజ్ సహా సంబంధిత శాఖల ఉద్యోగులు ఏమాత్రం అలసత్వానికి తావివ్వకూడదు. మీకు పూర్తి సమయమి వ్వాలనే నేను ఇన్ని రోజులు పర్యటన చేపట్ట లేదు. రెండేండ్లు గడిచిపోయినయి. ఇక నేను రంగంలోకి దిగక తప్పదు. అలసత్వం వహించిన ఏ స్థాయి అధికారినైనా ఉ పేక్షించేది లేదు. క్షమించేదీలేదు. కఠిన చర్యలు తీసుకుంటం." అని సీఎం స్పష్టం చేశారు.

"అదనపు కలెక్టర్లను నియమించుకోవడంలో ప్రధాన ఉద్దేశ్యం, పల్లెలు పట్టణాలను బాగు చేసుకోవాడానికే. వారు నిరంతరం క్షేత్రస్థాయిలో నిమగ్నమైవుండాలి. డీపీఓలు సహా కింది స్థాయి ఉద్యోగులను ఆ దిశగా ఉత్సాహపరుస్తూ అనుకున్న లక్ష్యాన్ని సాధించాలి. కానీ అదనపు కలెక్టర్లు అనుకున్న రీతిలో తమ పని సామర్థ్యాన్ని నిరూపించుకోవడం లేదు. వారి నుంచి నీను చానా ఆశించిన. కానీ అనుకున్నంత స్థాయికి వారి పనితీరు చేరుకుంటలేదు. కేవలం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి, మున్సిపల్ మంత్రులు మాత్రమే అన్నీ చేయాలంటే కాదు. ఏ జిల్ల లో ఆ జిల్లా మంత్రి, స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అన్ని స్థాయిల్లోని ప్రజాప్రతినిధులు, అధికారులు అందరూ... పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి కార్యక్రమాల్లో మరింతగా భాగస్వాములు కావాలె. ప్రజలను చైతన్యపరిచి వారిని మరింతగా భాగస్వాములను చేయాలె" అని సీఎం వివరించారు.

ఈ నేపథ్యంలో జూన్ 13 న ప్రగతి భవన్ లో అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు, జిల్లా పంచాయతీ అధికారులతో పల్లె ప్రగతి పట్టణ ప్రగతి కోసం చేపడుతున్న కార్యా చరణ, వారి పనితీరుపై సమీక్షా సమావే శాన్ని నిర్వహిస్తున్నామని సీఎం తెలిపారు.

"ప్రతి సీజన్లో కొన్ని ప్రత్యేక వ్యాధులు ప్రబలుతుండడం సహజం. వానాకాలం వస్తే మలేరియా డెంగ్యూ వంటి జ్వరాలు, చలికాలంలో స్వైన్ ఫ్లూ వంటి వ్యాధులు, ఎండాకాలంలో డయేరియా వంటి వ్యాధులు వస్తుంటయి. కరోనా వంటి వ్యాధుల నేపథ్యంలో సీజనల్ వ్యాధులను ముందస్తుగానే గుర్తించి అరికట్టడం అతి ముఖ్యం. ఇందుకు గాను.. పంచాయితీరాజ్ శాఖ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ, హెల్త్ డిపార్ట్ మెంట్ మూడు శాఖలు సమన్వయంతో పనిచేయాలి" అని సీఎం సంబంధిత మంత్రులకు, అధికారులకు సూచించారు.

వానాకాలం ప్రారంభమైన నేపథ్యంలో.. ట్యాంకులను శుద్ధి చేసి తాగునీరును అందిచాలన్నారు. కరోనా నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, ఎఎన్ఎం, ఆశా వర్కర్లు సహా వైద్యారోగ్యశాఖ ఉద్యోగులను సమాయత్తపర చాలని వారిని ముందస్తుగానే ప్రతీ సీజన్ లో సీజనల్ వ్యాధులను నివారించే చర్యలకు సిద్ధం చేయాలన్నారు. అభివృద్ధి కండ్లకు కనిపించినప్పుడే ప్రజలు ప్రజాప్రతినిధులు వెంట నడుస్తారని ఆ దిశగా ఇప్పటికే విజయం సాధించిన పల్లె ప్రగతి పట్టణ ప్రగతి కార్యక్రమాలు దేశంలోనే ఉ త్తమమైనవిగా గుర్తించబడినా యని, ఈనేపథ్యంలో అలసత్వం వదిలి మరింత పట్టుదలతో పనిచేసి తెలంగాణను అద్దంలా తీర్చిదిద్దుకోవాలని సీఎం అధికారులకు స్పష్టం చేశారు.

"ఇకనుంచి మున్సిపల్ డైరెక్టరు, పంచాయతీరాజ్ కమిషనర్లు జిల్లాలు, గ్రామాల పర్యటన చేపట్టాలని, వారు క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై పల్లెలు, పట్టణాల ప్రగతి తీరును పరిశీలించాల న్నారు. డీపీఓలను కూడా పల్లెల పర్యటనల్లో నిమగ్నం చేయాలని సీఎం స్పష్టం చేశారు. గ్రామాలు, మున్సిపాలిటీల పరిధిలో అక్రమ లే అవుట్లు యధావిధిగా కొనసాగుతున్నట్టు తనకు సమాచారం వుందని వాటి గురించి చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు మున్సిపాలిటీల బడ్జెట్ తయారీలో భాగస్వాములు కావాలని చెప్పామని ఏ మే–రకు అవుతున్నారని సీఎం ఆరాతీసారు.

తెలంగాణ ముఖచిత్రానికి జాతీయ రహదారులు అద్దం పడుతాయని వాటివెంట పచ్చని చెట్లను నాటి పెంచాలని సీఎం తెలిపారు. మొక్కలు పెంచి సంరక్షించే బాధ్యత సంబంధిత కాంట్రాక్టర్లదే కాబట్టి వారితో మొక్కలు నాటించే కార్యక్రమాన్ని పట్టుబట్టి చేయించాలన్నారు. రాష్ట్రంలో అడవుల పునరుజ్జీవనం మీద ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను సీఎం ఆదేశించారు.

కరోనా తగ్గుముఖం పట్టిందనీ ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఒక్క శాతానికి పాజిటివీ రేటు చేరుకున్నదని అధికారులు సీఎంకు వివరించారు. రాష్ట్రంలో నేడు పాజిటివిటీ రేటు కేవలం 4.7 శాతం మాత్రంగానే నమోదయ్యిందని, ప్రభుత్వ దవాఖానాల్లో బెడ్లన్నీ ఎక్కువ శాతం ఖాళీగా వున్నాయని సీఎంకు వారు తెలిపారు. కాగా కరోనా రోగులను పరామర్శించేందుకు సీఎం ఇటీవల చేపట్టిన గాంధీ, ఎంజీఎం దవాఖానాల పర్యటన, రాష్ట్ర వ్యాప్తంగా కరోనా బాధితులకే కాకుండా, చికిత్స చేసే వైద్యుల్లో కూడా ఎంతో భరోసాను, ధైర్యాన్ని నింపిందని సమావేశం అభిప్రాయపడింది. ఐసీయూల్లో కరోనా పాజిటివ్ తో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి పరామర్శించిన ఒకే ఒక ముఖ్యమంత్రి తెలంగాణ ముఖ్యమంత్రేనని, తద్వారా కరోనా భయాన్ని తొలగించి ఆత్మస్థైర్యాన్ని నింపడంలో సీఎం ముందు వరుసలో ఉ న్నారని అధికారులు సీఎం దృష్టికి తెచ్చారు.

సమీక్షా సమావేశంలో మంత్రులు కె. తారక రామారావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే ఎ. జీవన్ రెడ్డి, చీఫ్ సెక్రటరీ సోమేశ్ కుమార్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్ కుమార్, పంచాయతీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, సీఎం సెక్రటరీ స్మితా సభర్వాల్, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, మున్సిపల్ డైరెక్టర్ సత్యనారాయణ, పంచాయతీరాజ్ కమిషనర్ రఘునందన్ రావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో సుప్రీం చీఫ్‌జస్టిస్ ఎన్వీ రమణకు ఘనస్వాగతం

మొదటిపేజీ తరువాయి..



రాజ్‌భవన్ అతిథిగృహంలో బస చేయనున్నారు. అంతకుముందు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఎన్వీ రమణకు తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ హిమా కోహ్లీ, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి,మంత్రులు కేటీఆర్, మహమూద్ అలీ, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్, ఎమ్మెల్యేలు, సీఎస్ సోమేశ్ కుమార్, డీజీపీ మహేందర్ రెడ్డి, ఉన్నతాధికారులు ఘన స్వాగతం పలికారు.ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్, పలువురు ఎమ్మెల్యేలు సీజేఐకు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. శంషాబాద్ విమానాశ్రయం నుంచి సీజేఐ రాజ్‌భవన్‌కు బయల్దేరి వెళ్లారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, సీఎం కేసీఆర్ స్వాగతం పలికారు. ఉదయం జస్టిస్ ఎన్వీ రమణ తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శనంలో సతీసమేతంగా శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

రైతులకు రుణమాఫీ చేస్తామన్నారు

కనీసం వడ్డీ కూడా మాఫీ చేయలేదు

వైఎస్ షర్మిల టీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శల వర్షం



హైదరాబాద్,జూన్11 : రైతులకు టీఆర్ఎస్ ప్రభుత్వం రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చింది కానీ కనీసం వడ్డీ కూడా మాఫీ చేయలేదని..రైతులు పండించిన పంటను కొనుగోలు చేయటంలోను..పంటకు గిట్టుబాటు ధర కల్పించటంలోనూ సీఎం కేసీఆర్ ప్రభుత్వం విఫలం అయ్యిందని వైఎస్ షర్మిల టీఆర్ఎస్ ప్రభుత్వంపై విమర్శల వర్షం కురిపించారు. తెలంగాణలో పార్టీ పెడుతున్న వైఎస్ షర్మిల వచ్చీ రావటంతోనే దూకుడు పెంచారు. జులై8న పార్టీ పేరు ప్రకటిస్తానని చెప్పిన షర్మిల ముఖ్యనేతలతో వరుస సమావేశాలు నిర్వహిస్తునూ మరోవైపు తెలంగాణలో పర్యటిస్తున్నారు. రైతుల సమస్యలపై ఫోకస్ పెట్టారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని వికారాబాద్ జిల్లా దోమ మండలంపాలేపల్లి రైతును పరామర్శించారు. వారి కష్టసుఖాలు తెలుసుకున్నారు.పంట గిట్టుబాటు ధర వంటి అంశాలపై మాట్లాడారు. అనంతం షర్మిల మాట్లాడుతూ..రైతులు పండించిన ధాన్యాన్ని కొనటంలోను కరోనాను కట్టడి చేయటంతోను సీఎం కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని విమర్శలు సంధించారు. రైతు పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకునే కేసీఆర్ రైతులు వ్యతిరేకి అనీ రైతు ద్రోహి అంటూ విమర్శలు కురిపించారు. రైతులకు రుణమాఫీ చేస్తామన్న ప్రభుత్వం కనీసం వడ్డీలు కూడా మాఫీ చేయాలేదని..ప్రభుత్వం రైతుబంధు అంటూ ఇస్తున్న డబ్బులు రూ.5వేలు రైతులకు దేనికి సరిపోతాయి? అని ప్రశ్నించారు. రైతుబంధు పథకం అనేది రైతుకు ప్రభుత్వం చేస్తున్న అన్యాయానికి ఇచ్చే పరిహారమా? అని ప్రశ్నించారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేసి రైతులకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం రైతులను ఏమాత్రం పట్టించుకోవట్లేదని అన్నారు. రైతు పండించి ప్రతీ గింజను కొనాలని..మొలకెత్తిన ప్రతీ గింజా కొనాలని ఈ సందర్భంగా షర్మిల సీఎం కేసీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు అమ్ముకునే పంటను కూడా దళారులు దోచుకుంటున్నారనీ..కానీ ప్రభుత్వం ఏం చేస్తోంది? కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడీని కనీసం అరికట్టటానికి కూడా యత్నించటలేదని ఆరోపించారు. రైతులకు ఎంతో మేలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందనీ..రైతన్నలకు అన్యాయం చేస్తే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి ప్రభుత్వం మెడలు వంచుతామని షర్మిల వ్యాఖ్యానించారు.

హైదరాబాద్‌లో నాలాల ఆక్రమణలపై చర్యలు

ఆక్రమణదారులను ఉపేక్షించం: తలసాని

హైదరాబాద్,జూన్11 : హైదారాబాద్‌లో నాఆల ఆక్రమణలను కఠినంగా తొలగిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ హెచ్చరించారు. ఆక్రమణ దారులు ఎవరైనా ఉపేక్షించేది లేదన్నారు. కూకట్‌పల్లి, ఎల్బీనగర్, ఓల్డ్‌సిటీలో నాలాల పరిస్థితిపై శ్రద్ధ చూపిస్తామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. నగర అభివృద్ధికి మంత్రి కేటీఆర్ ప్రత్యేక దృష్టి సారించారని, నాలాల పనితీరుపై కేటీఆర్ అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహిస్తామని తెలిపారు. ఓపెన్ నాలాలను ప్రతిరోజూ మ్యాన్‌పవర్‌తో శుభ్రం చేయిస్తున్నా మన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో వర్షాకాల కార్యాచరణ ప్రణాళికపై మంత్రులు



మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత.. అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తకుండాపై ఓవర్లు, స్టీల్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు నిర్మించామని తెలిపారు. నాలాలు శుభ్రపరిచేందుకు యంత్రాల కొనుగోలు యోచనలో ఉన్నామని, నాళాలపై ప్రతిరోజూ అధికారులు నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. లాక్‌డౌన్ సమయంలో నగరంలో రోడ్లు, ఫుట్‌పాత్‌లు నిర్మించామని మంత్రి వెల్లడించారు. నాలాలపై నిర్మించిన అక్రమ నిర్మాణాలను త్వరలోనే తొలగిస్తామన్నారు. నాలాలు, చెరువులు ఆక్రమణలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

ప్రభుత్వ భూమి అనేది తెలంగాణ ప్రజల ఆస్తి

వాటిని అమ్మే అధికారం ప్రభుత్వానికి లేదు: బండి



హైదరాబాద్,జూన్11 :

రాష్ట్ర ప్రభుత్వం తమ ఆదాయ వనరుల కోసం ప్రభుత్వ భూములు అమ్మడాన్ని బీజేపీ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ అన్నారు. ప్రభుత్వ భూములకు రాష్ట్ర ప్రభుత్వం సంరక్షకుడిగా ఉండాలి తప్ప.. వాటిని అమ్మే అధికారం ఉండదని ఆయన అన్నారు. ప్రభుత్వ భూమి అనేది తెలంగాణ ప్రజల ఆస్తి అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను ప్రజల సౌకర్యాల కోసం ఉపయోగించాలే తప్ప అమ్మడం అనేది అనైతికం. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కోసం, ప్రభుత్వ ఆసుపత్రుల నిర్మాణం కోసం, విద్యాలయాల నిర్మాణం కోసం, శాస్త్ర సాంకేతిక పరిశోధనల కోసం, స్టేడియంల నిర్మాణం కోసం, బస్ స్టేషన్ల నిర్మాణం కోసం, కనీసం గిడ్డంగుల కోసమైన ఉపయోగించుకోవాలి తప్ప.. అమ్మడం సరైంది కాదు.

ఇది ఒక రకంగా భావితరాలకు నష్టం చేయడమే. భవిష్యత్ తరాల కోసం, ప్రజోపయోగ కార్యక్రమాల కోసం భూములను రక్షించాల్సిన ప్రభుత్వం.. హైదరాబాద్, ఇతర నగరాల చుట్టూ ఉన్న విలువైన భూములను అమ్మాలని నిర్ణయించడం తెలంగాణ ప్రజలను నట్టేట ముంచడమే అని బీజేపీ భావిస్తోంది. ఇప్పటికే పలు ప్రభుత్వ, అసైన్డ్, శిఖం, అటవీ, దేవాదాయ, భూదాన, వక్ఫ్, భూసంస్కరణల మిగులు తదితర భూములు అన్యాక్రాంతం అవుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. అలాంటి భూములను రక్షించలేని ప్రభుత్వం.. ఉన్న భూములను కూడా అమ్మాలని నిర్ణయించడం తెలంగాణ ప్రజల పాలిట శాపమని బీజేపీ భావిస్తోంది. భూముల అమ్మకాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాల రెవెన్యూగా మార్చుకోవాలనుకోవడం దురదృష్టకరం. ఈ భూ అమ్మకాలకు వ్యతిరేకంగా గతంలో టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. అసెంబ్లీ లోపల, బయట ఉ ద్యమాలు నిర్వహించిన విషయాన్ని ముఖ్యమంత్రి గుర్తుంచుకోవాలి. అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు భూకబ్జాలకు పాల్పడుతుంటే చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం చోద్యం చూస్తోంది. ఒకప్పుడు టీడీపీ, కాంగ్రెస్‌లో ఉన్న భూమాఫియా మొత్తం నేడు టీఆర్ఎస్ పార్టీలో నాయకులుగా చలామణి అవుతున్నారు. వారి కబ్జాలో ఉన్న భూమిని చట్టపరంగా విడిపించాలని బీజేపీ డిమాండ్ చేస్తుంది. తెలంగాణ అభివృద్ధి కోసం, తెలంగాణ ప్రజాప్రయోజనాల కోసం భూమిని ఉ పయోగించుకోవాలని బీజేపీ డిమాండ్ చేస్తోంది. అలా కాకుండా.. తమ ఇష్టానికి భూములు అమ్ముతామంటే.. ప్రజా ఉద్యమాన్ని, రాజకీయ ఉద్యమాన్ని తీసుకురావడమే కాకుండా న్యాయ పోరాటం కూడా చేస్తుందని బీజేపీ హెచ్చరిస్తుంది' అని ఆయన అన్నారు.

ఏపీలో మరో కీలకఘట్టం ఆవిష్కృతం

గోదావరి డెల్టాకు పోలవరం నుంచి నీళ్లు విడుదల



అమరావతి,జూన్11 : ఆంధ్రప్రదేశ్ ప్రజల వరంగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్టు నిర్మాణం వేగంగా పరుగులు తీస్తోంది. ఏపీ ప్రజల చిరకాల కోరిక ఇది. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమ ప్రాంతం అన్నివిధాలుగా సస్య శ్యామలం అవుతుందని ఏపీ ప్రజలు నమ్ముతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేస్తున్నారు. తాజాగా పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం అయ్యాయి. ఆ పనులు శరవేగంగా సాగుతుండగానే తొలి ఫలితం రాబోతుంది. గోదావరి డెల్టాకు పోలవరం మీదుగా నీటిని విడుదల కార్యక్రమానికి అంకురార్ఘణ జరిగింది. పోలవరం ప్రాజెక్ట్ వద్ద గోదావరి నది సహజ ప్రవాహాన్ని అప్రోచ్ ఛానల్ ద్వారా స్పిల్ వేకు మళ్లించిన సందర్భంగా శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాన్ని జలవనరుల శాఖ, మేఘా ఇంజనీరింగ్ అధికారులు చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్ బాబు, ఎస్ఈ నరసింహమూర్తి ఇతర అధికారులు పాల్గొన్నారు. గోదావరిలో నీటిని అప్రోచ్ కెనాల్‌కు విడుదల చేయడం ద్వారా ఆ నీరు స్పిల్ వే.. రివర్ స్లూయిజ్ గేట్ల ద్వారా ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్‌కు చేరి అక్కడి నుంచి సెంట్రల్ డెల్టాతో పాటు తూర్పు.. పశ్చిమ కాల్వల ద్వారా గోదావరి డెల్టా మొత్తాన్ని సస్య శ్యామలం చేయనుంది అంటున్నారు అధికారులు. సహజంగా గోదావరిలో ప్రవహించే నీరు బ్యారేజ్ నుంచి డెల్టాకు అందుతుందని.. పోలవరం పూర్తయిన తరువాత స్పిల్ వే.. రివర్ స్లూయిజ్.. పవర్ హౌస్ డిశ్చార్జ్‌ల ద్వారా బ్యారేజ్‌ల నుంచి కాలువలకు చేరుతుంది అంటున్నారు. పోలవరం నిర్మాణంలో స్పిల్ వే తో పాటు మూడు గ్యాపులుతో పాటు జల విద్యుత్ కేంద్రం, జల రవాణా పనులు కీలకమైనవి. ఇందులో ఇంజనీరింగ్ నిబంధనలకు అనుగుణంగా స్పిల్ వే పనిని మేఘా ఇంజనీరింగ్ ఛాలెంజ్‌గా తీసుకొని పూర్తి చేసింది. గోదావరి నీటిని అప్రోచ్ ఛానల్ నుంచి దిగువకు విడుదల చేయడం ప్రారంభించారు. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు పోలవరం దిగువన ఉన్న తాడిపూడి, పట్టిసీమ, పుష్కరం తదితర ఎత్తిపోతల పథకాల ద్వారా తాగు, సాగు నీరు ఇక నుంచి ఈ అప్రోచ్ ఛానల్ ద్వారానే విడుదల కానుంది. దీంతో ఇక నుంచి ఏడాది పొడవునా నీటిని అప్రోచ్ ఛానల్ ద్వారా మళ్లించి మళ్లీ పైలెట్ ఛానల్ ద్వారా గోదావరిలోకి కలుపుతారు. గోదావరి నది నీటిని 6.6 కిలోమీటర్ల మేరకు మళ్లించడం అన్నది అసలు సాధారణ విషయం కాదు. ఇది ప్రపంచంలోనే అరుదైన సంఘటన అంటున్నారు అధికారులు. దేశంలోనే రెండో పెద్ద నది అయిన గోదావరిపై ఇలాంటి ప్రయత్నం చేయడం సాహసమే అంటున్నారు. సహజంగా ప్రవహించే గోదావరిని పోలవరం వద్ద కుడి వైపునకు అంటే అప్రోచ్ ఛానెల్ నుంచి పైలెట్ ఛానల్ వరకు మళ్లిస్తారు. ఇప్పుడు మొదలవుతున్న ఈ నీటి ప్రక్రియ ప్రాజెక్ట్ పూర్తయిన తరువాత కూడా అలాగే కొనసాగుతుందంటున్నారు అధికారులు. నదీ మధ్య భాగంలో మూడు గ్యాపులు నిర్మించాలి. అందులో గ్యాప్-2 గా పిలిచే ఈసీఆర్ఎఫ్ అతిపెద్దది. 50 లక్షల క్యూసెక్కుల నీటి ఒత్తిడిని తట్టుకునేలా దీనిని నిర్మిస్తారు. ఈ పని ప్రారంభం కావాలంటే నీటి ప్రవాహం నిలిపివేయాలి. అందుకోసం అప్పర్ కాఫర్ డ్యాం నిర్మించి ఈ ఏడాది వచ్చే వరదల్లో కూడా ఈసీఆర్ఎఫ్ నిర్మాణ పనులు కొనసాగించాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించింది. ఇందులో భాగంగానే ఈ నది మళ్లింపు చేపట్టారు. అప్రోచ్ ఛానెల్, స్పిల్ ఛానెల్, పైలెట్ ఛానెల్ పొడవు 6.6 కిలోమీటర్లు ఉంది. ఇవి ప్రధాన నదికి కుడివైపున సమాంతరంగా నిర్మించారు. అప్రోచ్ ఛానెల్ స్పిల్ వే వైపు 2.4 కిలోమీటర్లు వరకు నిర్మించారు. స్పిల్ వే నుంచి స్పిల్ ఛానెల్ 3.1 కిలోమీటర్లు, స్పిల్ ఛానెల్ చివరి నుంచి మళ్లీ గోదావరి తన సహజసిద్ధ ప్రవాహంలోకి కలిసే విధంగా 1.1 కిలోమీటర్లు పైలెట్ ఛానెల్ నిర్మించారు. ఎగువ కాఫర్ డ్యాం మూడు రీచ్లుగా 2480 మీటర్ల పొడవు, 42.5 మీటర్ల ఎత్తున నిర్మించారు. ఇటీవలనే అప్పర్ కాఫర్ డ్యాం గ్యాపులను ప్రభుత్వ నిర్ణయానుసారం మేఘా ఇంజనీరింగ్ పూడ్చివేసింది. ఫలితంగా 30 లక్షల క్యూసెక్కుల వరకు వరద వచ్చినా నదిలో నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకం లేకుండా ప్రవాహం అప్రోచ్ ఛానెల్ మీదుగా వెళ్లిపోతుంది. గోదావరి నది ప్రవాహాన్ని మళ్లించే పనులను మేఘా ఇంజనీరింగ్ రికార్డ్ సమయంలో పూర్తి చేసింది. గోదావరి ప్రవాహం కుడివైపునకు మళ్లీ స్పిల్ వేకు చేరాలంటే కనీస మట్టానికి తవ్వాలి. అందుకోసం అప్రోచ్ ఛానెల్ ను 2.4 కిలోమీటర్ల మేర తవ్వేశారు. దాంతో పెద్ద నది రూపుదిద్దుకుంది. ఇందుకోసం కోటి 54 లక్షల 88వేల మట్టి తవ్వకం పనులు చేయాల్సి ఉండగా ఇప్పటికి కోటి 4లక్షల 88వేల ఘనపు మీటర్లు పూర్తయింది. ఇందుకోసం రేయింబవళ్లు యంత్రాంగం పని చేసింది. మొత్తం మట్టి పని 5 కోట్ల 92 లక్షల పనికి గాను 5 కోట్ల 24 లక్షల ఘనపు మీటర్ల మేర పూర్తయ్యింది. మొత్తం సిసి బ్లాకులు 17 లక్షల ఘనపు మీటర్లు కాగా 15.17 లక్షల ఘనపు మీటర్ల పని పూర్తయ్యింది. ప్రపంచంలో ఇంతవరకు అతిపెద్ద వరద డిశ్చార్జ్ స్పిల్ వే గా త్రిగాడ్జెస్ జలాశయంకు పేరుంది. దీని కన్నా పోలవరం సామర్థ్యం మూడు లక్షల క్యూసెక్కులు అధికం. దీనిని తట్టుకునే విధంగా ప్రపంచంలోనే అతపెద్ద గేట్ల ఏర్పాటు పూర్తయింది. ఇందుకోసం 15.17 ఘనపు మీటర్ల కాంక్రీట్ పని పూర్తయ్యింది. గేట్లను హైడ్రాలిక్ పద్ధతిలో నిర్వహించేందుకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. ఇందులో భాగంగా 22 పవర్ ప్యాక్ లను 44 గేట్లకు అమర్చారు. 28 రేడియల్ గేట్లను హైడ్రాలిక్ పద్ధతిలో ఈ సీజన్లో వరద వచ్చినా విడుదల చేసే విధంగా 28 గేట్లను ఎత్తి ఉంచారు.

ఎంపి రఘురామను సస్పెండ్ చేయండి

స్పీకర్ ఓం బిర్లాను కోరిన వైకాపా

న్యూఢిల్లీ,జూన్11 : నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణరాజుపై లోక్‌సభ స్పీకరుకు వైసీపీ మరోసారి ఫిర్యాదు చేసింది. స్పీకర్ ఓం ప్రకాశ్ బిర్లాను శుక్రవారం వైసీపీ చీఫ్ విప్ మార్గాని భరత్ కలిశారు. వైయస్ఆర్‌సీపీ టికెట్ మీద నర్సాపురం నుంచి ఎంపీగా ఎన్నికై, పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని ఫిర్యాదు చేశారు. వెంటనే



రఘురామరాజు పార్లమెంటు సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు. రఘురామకృష్ణరాజు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ చేసిన వ్యాఖ్యలపై గతంలోనే ఆధారాలను తాము లోక్ సభ స్పీకర్‌కు సమర్పించామని అనేక పర్యాయాలు డిస్ క్వాలిఫికేషన్‌కు సంబంధించి స్పీకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని భరత్ పేర్కొన్నారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్ ప్రకారం పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అతిక్రమించిన రఘురామకృష్ణరాజును వెంటనే డిస్ క్వాలిఫి÷ చేయాల్సిందిగా ఈరోజు మరోసారి లోక్ సభ స్పీకర్‌ను కలిసి విజ్ఞప్తి చేశామని భరత్ చెప్పారు.

స్వప్రయోజనాల కోసమే జగన్ ఢిల్లీ పర్యటన

బెయిల్ రద్దవుతుందనే భయంతో ఢిల్లీ పెద్దల ముందు సాగిల

విమర్శలు గుప్పించిన మాజీమంత్రి, టిడిపి నేత యనమల

అమరావతి,జూన్11 : స్వప్రయోజనాల కోసమే జగన్ రెడ్డి ఢిల్లీ పర్యటన చేపట్టారని టీడీపీ సీనియర్ నేత, మాజీమంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. జగన్ రెడ్డి ఢిల్లీ పర్యటన వల్ల రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని తెలిపారు. బెయిల్ రద్దవుతుందనే భయంతో ఢిల్లీ పెద్దల ముందు సాష్టాంగపడుతున్నారని ఆయన అన్నారు. జగన్ రెడ్డి ఢిల్లీ వెళ్లిన ప్రతిసారి సమావేశం తాలూకు వివరాలను ఎందుకు ప్రజలకు వెల్లడించడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీనిని బట్టే లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నారని బహిర్గతం అవుతోందన్నారు. శుక్రవారం యనమల మీడియాతో మాట్లాడుతూ కేంద్ర పెద్దలతో చర్చించిన అంశాలు ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. జగన్ రెడ్డి తన అక్రమ సంపద రూ.43వేల కోట్లను ప్రభుత్వ ఖజనాకు జమచేస్తే రెవెన్యూలోటు ఉండదన్నారు. ప్రత్యేక హోదాతో సహా విభజన చట్టంలో అంశాల అమలు, కేంద్రం నుంచి నిధులు రాబట్టడంలో జగన్మోహన్‌రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని వ్యాఖ్యానించారు. రాష్ట్ర సమస్యలను జగన్ రెడ్డి ఏనాడూ పట్టించుకోలేదన్నారు. వైసీపీ ఎంపీలు ఏనాడూ పార్లమెంట్‌లో నోరెత్తలేదని యనమల తెలిపారు. ఎన్నికలకు ముందు ప్రత్యేక హోదా సాధిస్తానని ఊరూరా తిరిగి ప్రచార చేశారని... ప్రత్యేక హోదా తెస్తామని ఓట్లు పొందారని, ఇప్పుడు ప్రజల గొంతు కోశారని మండిపడ్డారు. 25 మందికి 25 ఎంపీలను ఇస్తే కేంద్రం మెడలు వంచి ప్రత్యేక హోదా సాధిస్తానన్న మాట ఏమైందని ప్రశ్నించారు. 28 మంది ఎంపీలు ఉన్నప్పటికీ మూగనోము పాటిస్తున్నారని విమర్శించారు. కేసుల మాఫీ కోసం కేంద్రం వద్ద మెడలు దించారన్నారు. హోదా వస్తే ఒంగోలు కూడా హైదరాబాద్‌లా తయారు అవుతుందనే మాటలు మర్చిపోయారా అని నిలదీశారు. ప్రత్యేక హోదా వస్తేనే పెట్టుబడులు, ఉద్యోగాలు, నిధులు వస్తాయని యువతకు చెప్పిన జగన్ రెడ్డి.. నేడు వారికి నమ్మకద్రోహం చేశారన్నారు. ఎందుకు ప్రత్యేక హోదాను కేంద్రాన్ని అడగలేక పోతున్నారని ప్రశ్నించారు. హోదాను ఓట్లు దండుకోవడానికే, ప్రజలను మోసం చేయడానికే జగన్ రెడ్డి వినియోగించుకున్నారు తప్ప.. చిత్తశుద్ధి లేదన్నారు. జగన్ రెడ్డి గట్టిగా



అడిగితే అవినీతి కేసుల్లో జైలుకు పంపిస్తారనే భయంతో అడగలేకపోతున్నారని ఆయన తెలిపారు. మూడు రాజధానుల పేరుతో విధ్వంస రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇడుపులపాయకే పరిమితమైన ఉన్మాదాన్ని రాష్ట్రం మొత్తం విస్తరిస్తున్నారన్నారు. మూడు రాజధానుల పేరుతో రాష్ట్రాన్ని 30 ఏళ్లు వెనక్కి నెట్టారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా పరిశ్రమలు రాకపోవడంతో యువత ఉద్యోగాలు లేక నష్టపోతు న్నారన్నారు. మరోవైపు రాష్ట్రానికిఆదాయం లేకపోవడంతో లక్షలాది కోట్లు అప్పులు చేస్తున్నారని, ఇది చాలదన్నట్లు ప్రభుత్వ ఆస్తులను తనాఖా పెట్టే స్థితికి దిగజారారని దుయ్యబట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భవనాలు, స్థలాలను తనఖా పెట్టి రూ.5వేల కోట్లు సమీకరించాలని భావించడం జగన్ రెడ్డి అసమర్థ విధానాలకు నిదర్శనమని యనమల రామకృష్ణుడు అన్నారు.

పరీక్షల నిర్వహణ కోసం ఈసీ నియామకం

విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొని తగిన నిర్ణయం

ప్రస్తుతం అయితే పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేదు

పరీక్షలపై క్లారిటీ ఇచ్చిన ఆదిమూలం సురేష్

అమరావతి,జూన్11 : ఆంధ్ర ప్రదేశ్ విద్యాశాఖ మంత్రి ఆదిమూలం సురేష్ బాబు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన 10, ఇంటర్మీడియట్ పరీక్షలపై స్పందించారు. పది, ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ కోసం ఇసీని నియమించామని తెలిపారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకొనే పరీక్షలపై నిర్ణయం తీసుంటామని అన్నారు. పరీక్షల నిర్వహణపై గురువారం అధికారులతో సమావేశమైనట్లు తెలిపారు. ప్రస్తుతం అయితే పరీక్షలు నిర్వహించే పరిస్థితి లేదని అన్నారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతకు ఎటువంటి ఇబ్బంది లేదు అన్నప్పుడు పరీక్షలు నిర్వహిస్తామని విద్యార్థుల తల్లిదండ్రులు భయపడాల్సిన పనిలేదని, పరిస్థితిలు అనుకూలించిన తర్వాతే పరీక్షలు పెడతామని తెలిపారు. కొంతమంది పరీక్షలు రద్దు చెయ్యాలంటూ రాద్ధాంతం చేస్తున్నారు.. కానీ ఓ తండ్రిగా పరీక్షల నిర్వహణకే మద్దతిస్తానని తెలిపారు సురేష్. ఇక ఇదే సమయంలో ప్రైవేట్ పాఠశాలలకు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. పరీక్షలు రద్దయ్యాయని కాలేజీలు అడ్మిషన్లు తీసుకుంటే కఠినంగా వ్యవరిస్తామని తెలిపారు. ఒక్క ఫిర్యాదు వచ్చినా ఊరుకునేది లేదని హెచ్చరించారు. దీనిపై టాస్క్ ఫోర్స్, విజిలెన్స్ టీమ్స్ ను ఏర్పాటు చేస్తామని వివరించారు.



పౌరసరఫరాల శాఖ బకాయిలు విడుదల చేయండి

కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కోరిన సిఎం జగన్

ఢిల్లీ పర్యటన ముగించుకుని అమరావతి చేరుకున్న సిఎం

న్యూఢిల్లీ,జూన్11 : రాష్ట్ర సివిల్ సప్లైకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను సిఎం జగన్ కోరారు. మరో 2 నెలలు ఉచిత బియ్యాన్ని పొడిగించి నందుకు గోయల్‌కు జగన్ ధన్యవాదాలు తెలిపారు. ఉచిత రేషన్ బియ్యం కింద కేంద్రం.. ఏపీ పౌర సరఫరాలకు 3,229 కోట్ల బకాయి పడిందని,



రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలంటే.. బకాయిల విడుదల అత్యంత అవసరని జగన్ అన్నారు. 0.91 కోట్ల రేషన్ కార్డులకే బియ్యం పంపిణీని పరిమితం చేశారని, కేటాయింపులను 1,54,148 మెట్రిక్ టన్నులకు తగ్గించారని తెలిపారు. దీనివల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరుగుతోందని చెప్పారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో సీఎం జగన్ బిజీబిజీగా గడిపారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై కేంద్రమంత్రులతో చర్చించారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో జగన్ సమావేశమయ్యారు. జాతీయ ఆహార భద్రతా చట్టంలో హేతుబద్ధతలేని పరిమితి వల్ల.. పేదలు తీవ్రంగా నష్టపోతున్నారని జగన్ పేర్కొన్నారు. సీఎం జగన్ వెంట ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, సీఎస్ ఆదిత్యనాథ్ ఉన్నారు. ఇదిలావుంటే రెండు రోజుల ఢిల్లీ పర్యటన ముగించుకుని సిఎం జగన్ సాయంత్రం గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అనంతరం గన్నవరం నుండి రోడ్డు మార్గంలో తాడేపల్లి నివాసానికి బయలుదేరారు. సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన సందర్భంగా కేంద్ర మంత్రులు అమిత్‌షా, పీయూష్ గోయల్, షెకావత్, జవదేకర్, ధర్మేంద్ర ప్రధాన్, నీతి ఆయోగ్ వైస్ ఛైర్మన్ రాజీవ్ కుమార్‌లను కలిశారు. వారితో రాష్ట్రాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలను సీఎం చర్చించారు. రాష్ట్రాభివృద్ధికి సహకరిస్తామని కేంద్ర మంత్రులు హామీ ఇచ్చారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా గురువారం మధ్యాహ్నం ఢిల్లీ చేరుకున్న సీఎం వైఎస్ జగన్.. రాత్రి వరకు సమావేశాలతో బిజీగా గడిపారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో సీఎం వైఎస్ జగన్ నిన్న రాత్రి 9 గంటల నుంచి 10.35 వరకు సమావేశమయ్యారు. రాష్ట్ర అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సుహృద్భావ వాతావరణంలో సమావేశం సాగింది. అలాగే శుక్రవారం ఉదయం కేంద్ర ఉక్కుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, రైల్వే శాఖ మంత్రి పీయూష్ గోయల్‌తో సీఎం భేటీ అయ్యారు.

శాసన మండలి ఛైర్మన్ పదవుల భర్తీకి ప్రభుత్వం అడుగులు

నాలుగు పేర్లను గవర్నర్ ఆమోదం కోసం పంపిన ప్రభుత్వం

అమరావతి,జూన్11 : ఏపీ ముఖ్యమంత్రి జగన్ మరో అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటి వరకు శాసన మండలి ఛైర్మన్ గా వ్యవహరించిన మహ్మద్ షరీఫ్ పదవీ విరమణ చేసారు. ఆయన టీడీపీ నుండి ఎమ్మెల్సీగా నియమితులై..టీడీపీ హయాంలో మండలి ఛైర్మన్ అయ్యారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మూడు రాజధానుల వ్యవహారంలో నాటి మండలి ఛైర్మన్ తీరు వివాదాస్పదమైంది. అయినా..సీఎం జగన్ కొత్త ఛైర్మన్‌ను నియమించే ప్రయత్నం చేయలేదు. శాసనమండలిలో టీడీపీ సంఖ్య అధికంగా ఉండటంతో..ప్రభుత్వ బిల్లులను అడ్డుకుంటున్నారనే ఆగ్రహంతో ఏకంగా మండలి రద్దుకే అసెంబ్లీ జగన్ తీర్మానం చేసారు. ఇక, ఇప్పుడు వరుసగా వైసీపీ అభ్యర్దులతో మండలిలో పార్టీ ఆధిపత్యం పెరుగుతోంది. ఇదే క్రమంలో మండలి ఛైర్మన్.. వైస్ ఛైర్మన్ పదవులను భర్తీ చేయాల్సి ఉంది. ఇప్పటికే ఛైర్మన్ పదవీ విరమణ చేయగా..డిప్యూటీ ఛైర్మన్ ఈ నెలలోనే పదవీ కాలం ముగియనుంది. అయితే, మండలి ఛైర్మన్ పదవి ఎవరికి ఇస్తారనే ఉత్కంఠ ఇప్పటి వరకు పార్టీలో కొనసాగుతోంది. అనూహ్యంగా ముఖ్యమంత్రి మండలి ఛైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. మండలిలో గవర్నర్ నామినేటెడ్ కోటాలో ఖాళీ అవుతున్న నాలుగు ఎమ్మెల్సీ స్థానాల్లో కొత్త వారి నియామకానికి సంబంధించి ఎంపిక ప్రక్రియ సైతం పూర్తి చేసారు. నాలుగు పేర్లను గవర్నర్ ఆమోదం కోసం పంపారు. అందులో కడప జిల్లాకు చెందిన బీసీ వర్గానికి చెందిన రమేష్ యాదవ్, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన ఎస్సీ వర్గానికి చెందిన కొయ్యా మోషేన్ రాజు, తూర్పు గోదావరి జిల్లా కాపు వర్గానికి చెందిన తోట త్రిమూర్తులు, గుంటూరు జిల్లా రెడ్డి వర్గానికి చెందిన లేళ్ల అప్పిరెడ్డి ఉన్నారు. ఇదే సమయంలో మండలి ఛైర్మన్ పదవి సైతం భర్తీ చేస్తూ ముఖ్యమంత్రి నిర్ణయం తీసుకున్నట్లుగా విశ్వస నీయ సమాచారం. అనూహ్యంగా ఇప్పటి వరకు మండలి ఛైర్మన్ గా ఉన్న షరీష్ సొంత జిల్లా పశ్చిమ గోదావరికే మరలా మండలి ఛైర్మన్ పదవి దక్కనున్నట్లు పార్టీ ప్రముఖుల ద్వారా తెలుస్తోంది. ఇప్పటికే శాసనసభ స్పీకర్ గా ఉత్తరాంధ్ర ప్రాంతం..బీసీ వర్గానికి ఇవ్వటంతో.. ఇప్పుడు గోదావరి జిల్లాలకు చెందిన ఎస్సీ వర్గానికి మండలి ఛైర్మన్ కేటాయిస్తున్నారు. సామాజిక సమీకరణాల విషయంలో పక్కాగా ఉండే సీఎం జగన్ మండలి డిప్యూటీ ఛైర్మన్ మైనార్టీకి ఇచ్చే అవకాశం ఉంది. ఇక, కొయ్యా మోషేన్ రాజు వైసీపీ ఆవిర్భావం నుండి పార్టీలో కీలకంగా ఉన్నారు. 2009 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా కొవ్వూరు నుండి పోటీ చేసి టీడీపీ అభ్యర్థి టీవీ రామారావు చేతిలో ఓడిపోయారు. 2012 నుండి వైసీపీ పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉన్నారు. 2014 ఎన్నికల్లో కొవ్వూరు నుండి టిక్కెట్ ఆశించినా తానేటి వనితకు టిక్కెట్ ఖరారైంది. దీంతో అప్పుడు టీడీపీలో చేరారు. తిరిగి రెండు నెలల కాలంలోనే వైసీపీలోకి తిరిగి వచ్చేసారు. జిల్లాలోని రిజర్వ్ నియోజకవర్గాలైన గోపాలపురం, కొవ్వూరు ప్రాంతాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు పని చేసారు. అయితే, 2019 ఎన్నికల సమయంలో టిక్కెట్ ఆశించిన మోషేన్ రాజుకు అప్పట్లోనే జగన్ ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ఇప్పటికే అదే జిల్లా నుండి ఎస్సీ వర్గానికి చెందిన తానేటి వనిత మంత్రిగా ఉన్నారు. కాపు వర్గానికి చెందిన ఆళ్ల నాని డిప్యూటీ సీఎంగా.. క్షత్రియ వర్గానికి చెందిన రంగనాథ రాజు మంత్రిగా కొనసాగుతున్నారు. ఇక, ఇప్పుడు మరో ఎస్సీకి మండలి ఛైర్మన్ పదవి ఇవ్వటం ద్వారా జిల్లాలో ఇచ్చిన ప్రాధాన్యత స్పష్టం అవుతోంది. చివరి నిమిషంలో అనూహ్య మార్పులు జరిగితే మినహా..ఈ నియామకానికి సంబంధించి అధికారిక ప్రకటన వెలువడటం ఖాయంగా కనిపిస్తోంది.

అగ్రిగోల్డ్ వ్యవహారలపై హైకోర్టులో విచారణ

భూములు కొనుగోళ్లపై ఆరా

హైదరాబాద్,జూన్11 : అగ్రిగోల్డ్ డిపాజిటర్ల కుంభకోణంపై తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. తెలంగాణ అగ్రిగోల్డ్ డిపాజిటర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆండాళ్ రమేష్ బాబు దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ విచారణ జరిగింది. అగ్రిగోల్డ్ కంపెనీ చేసిన ప్రతిపాదనకు జస్టిస్ ఎంఎస్ రామచందర్‌రావు, జస్టిస్ అమర్‌నాథ్ గౌడ్ బెంచ్ తీవ్రంగా స్పందించింది. అగ్రిగోల్డ్ కంపెనీ ప్రతిపాదనకు అంగీకరిస్తే మరో ఇరవై ఏళ్ల పర్యవేక్షణ చేయాల్సి ఉంటుందని హైకోర్టు తెలిపింది. అగ్రిగోల్డ్ కంపెనీ చేసిన సవరించిన ప్రతిపాదనలపై సమాధానం ఇవ్వాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అగ్రిగోల్డ్ కంపెనీ ఆస్తులు ఎక్కువగా ఆంధ్రాలో ఉన్నందున ఆ రాష్ట్ర హైకోర్టుకు ఏపీ విభజన చట్టం ప్రకారం బదిలీ చేసే విషయాన్ని న్యాయస్థానం పరిశీలిస్తోంది. బినామీ ద్వారా మిడ్జిల్‌లో అగ్రిగోల్డ్ యాజమాన్యం భూములు కొన్నది.

దీనికి సంబంధించి తెలంగాణ సీఐడీ ఎస్పీ అఫిడవిట్ దాఖలు చేశారు. మిడ్జిల్‌లో 15.18 కోట్లు పెట్టి 150 ఎకరాలు ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. సదరు వ్యక్తి అగ్రిగోల్డ్ కంపెనీ బినామీ అని తెలంగాణ సీఐడీ సందేహం వ్యక్తం చేస్తోంది. అలాగే అగ్రిగోల్డ్ కంపెనీ డైరెక్టర్ అవ్వా సీతారామారావుకు చెందిన శివశక్తి టింబర్ ఎస్టేట్‌తో బిడ్‌లో పాల్గొన్న వ్యక్తికి సంబంధాలు ఉన్నాయి. కానిస్టేబుల్‌గా పనిచేసిన వ్యక్తి 15.18 కోట్లు పెట్టి 150 ఎకరాలు కొనే సామర్థ్యం లేదని ఇన్‌కం ట్యాక్స్ శాఖ ద్వారా సేకరించిన వివరాలను తెలంగాణ సీఐడీ సమర్పించింది. రెండు రాష్ట్రాలు అగ్రిగోల్డ్ సమస్యపై చర్చించి కలిసి పరిష్కారం కనుక్కునేందుకు ఏపీ అడ్వకేట్ జనరల్ శ్రీరామ్ హైకోర్టును సమయం కోరారు. విజయవాడలో ఎస్‌బీఐ నిర్వహించిన వేలంలో అగ్రిగోల్డ్‌కు చెందిన షాపింగ్ మాల్‌ను సింగిల్ బిడ్డర్‌కు కేటాయించడంపై సీఐడీ పరిశీలన జరిపేందుకు సమయం కావాలని ఏపీ అడ్వకేట్ జనరల్ కోరారు. తదుపరి విచారణను హైకోర్టు ఈ నెల 25కి వాయిదా వేసింది.

పోలవరం వద్ద మేఘా కంపెనీ పూజలు


ఏలూరు,జూన్11 : పోలవరం ప్రాజెక్టు నిర్మాణం ఆంధ్రప్రదేశ్ ప్రజల చిరకాల కోరిక. ఈ ప్రాజెక్టు పూర్తయితే తమ ప్రాంతం అన్నివిధాలుగా సస్యశ్యామలం అవుతుందని వారి నమ్మకం. దివంగత మహానేత రాజశేఖర్ రెడ్డి హయాంలో పట్టాలెక్కిన పోలవరం ప్రాజెక్టు ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పరుగులు పెడుతోంది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేస్తున్నారు. ఈ క్రమంలోనే పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం జరుగుతుండగానే తొలి ఫలితం రాబోతుంది. గోదావరి డెల్టాకు పోలవరం మీదుగా నీటిని విడుదల కార్యక్రమానికి శుక్రవారం అంకురార్ఘణ జరిగింది. పోలవరం ప్రాజెక్ట్ వద్ద గోదావరి నది సహజ ప్రవాహాన్ని అప్రోచ్ ఛానల్ గుండా స్పిల్ వేకు మళ్లించిన సందర్భంగా శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాన్ని జలవనరుల శాఖ, మేఘా ఇంజనీరింగ్ అధికారులు చేశారు. ఈ కార్యక్రమంలో జలవనరుల శాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి, పోలవరం సీఈ సుధాకర్ బాబు, ఎస్ఈ నరసింహమూర్తి, ఈఈలు మల్లి ఖార్జునరావు, ఆదిరెడ్డి, బాలకృష్ణ, మేఘా ఇంజనీరింగ్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ రంగరాజన్, జీఎంలు ముద్దుకృష్ణ, దేవ్ మని మిశ్రా, సీజీఎం రవీంద్రరెడ్డి, ఎజీఎం రాజేశ్, డీజీఎం శ్యామలరావు, మేనేజర్ మురళి పాల్గొన్నారు.



ఇంకా పాక్ జైలులోనే మగ్గుతున్న కులభూషణ్ జాదవ్

లాయర్‌ను నియమించుకునే అవకాశం ఇవ్వాలి: భారత్

న్యూఢిల్లీ,జూన్11 :
పాక్ జైలులో మగ్గుతున్న కులభూషణ్ జాదవ్ భవితవ్యంపై ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి. అయితే సుష్మాస్వరాజ్ ఉన్నంతకాలం ఆమె ఈ వ్యవహారాన్ని ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేసేవారు. కానీ ఇప్పుడు దీనిపై విదేశాంగశాఖ పెద్దగా స్పందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. తాజాగా భారత నావికా దళం మాజీ అధికారి కుల్‌భూషణ్ జాదవ్‌కు విధించిన మరణ శిక్షపై అపీలు చేయడానికి అవకాశం కల్పించడాన్ని భారత ప్రభుత్వం స్వాగతించింది. పాకిస్థాన్ మిలిటరీ కోర్టు జాదవ్‌కు విధించిన శిక్షపై ఆ దేశంలోని ఏదైనా హైకోర్టులో అపీలు చేయడానికి వీలు కల్పిస్తూ పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీ గురువారం ఓ బిల్లును ఆమోదించడం మంచి పరిణామమని తెలిపింది. అయితే ఆయనకు భారత దేశానికి చెందిన న్యాయవాదిని నియమించుకోవడానికి అవకాశం ఇవ్వాలని, లేదా, ఓ తటస్థ దేశానికి చెందిన న్యాయవాది ద్వారా న్యాయ సహాయం అందే విధంగా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఈ చట్టం అర్థరహితమవుతుందని పేర్కొంది. జాదవ్ తనకు పాకిస్థాన్ మిలిటరీ కోర్టు విధించిన మరణ శిక్షపై అపీలు చేసే అవకాశం కల్పించే బిల్లును పాకిస్థాన్ పార్లమెంటు గురువారం ఆమోదించింది. దీంతో ఆయన పాకిస్థాన్‌లోని ఏదైనా హైకోర్టులో అపీలు చేయడానికి మార్గం సుగమం అయింది. అంతర్జాతీయ న్యాయ స్థానం తీర్పును అమలు చేస్తూ సమీక్ష, పునఃపరిశీలన చేయించే హక్కు ఈ బిల్లు ద్వారా ఆయనకు లభించింది. కుల్‌భూషణ్ జాదవ్‌ను 2016లో బలూచిస్థాన్‌లో అరెస్టు చేసినట్లు పాకిస్థాన్ చెప్తోంది. ఆయన గూఢచర్యానికి పాల్పడినట్లు ఆరోపిస్తూ, పాకిస్థాన్ మిలిటరీ కోర్టు ఆయనకు మరణ శిక్ష విధించింది. ఈ ఆరోపణలను భారత దేశం తీవ్రంగా ఖండించింది. వ్యాపారం నిర్వహిస్తున్న జాదవ్‌ను పాకిస్థానీ అపరేటివ్స్ ఇరాన్‌లోని చాబహార్ పోర్టు నుంచి కిడ్నాప్ చేశారని పేర్కొంది.
ఆయనకు విధించిన మరణ శిక్షను 2018లో ఐసీజే నిలిపేసింది. ఈ నేపథ్యంలో ఇంటర్నేషనల్ కోర్ట్ ఆఫ్ జస్టిస్ (రివ్యూ అండ్ రీకన్సిడరేషన్) యాక్ట్‌ను పాకిస్థాన్ నేషనల్ అసెంబ్లీ గురువారం ఆమోదించింది. ఈ చట్టం పాకిస్థాన్ మొత్తానికి వర్తిస్తుంది. వెంటనే అమల్లోకి వచ్చింది.
జాదవ్ కేసులో ఐసీజే తీర్పు దృష్ట్యా పాకిస్థాన్ ప్రభుత్వం గతంలో ఓ ఆర్డినెన్స్‌ను జారీ చేసింది. వియెన్నా కాన్సులర్ సంబంధాల ఒప్పందం ప్రకారం విదేశీయులకు లభించిన హక్కులకు సంబంధించి ఐసీజే ఏదైనా ఆర్డర్‌ను జారీ చేసినపుడు, లేదా, ఈ ఒప్పందం ప్రకారం లభించిన హక్కులకు సంబంధించి ఓ విదేశీయుడు బాధితుడైనపుడు సమీక్షించడానికి, పునఃపరిశీలన జరపడానికి హైకోర్టుకు అధికారం ఉందని ఈ బిల్లు చెప్తోంది.



సత్ఫలితాలు ఇస్తున్న హరితహారం

ఏపుగా పెరుగుతున్న మొక్కలతో పచ్చదనం

రహదారులకిరువైపులా పరుచుకున్న పచ్చదనం

హైదరాబాద్,జూన్11 : పచ్చదనం దిశగా తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయి. గత ఐదారేళ్లుగా చేపట్టిన కార్యక్రమంతో ఇప్పుడు తెలంగాణలో మొక్కలు ఏపుగా ఎదిగి పచ్చదనం కనిపిస్తోంది. ఈ కార్యక్రమాన్ని కేంద్రం ఇప్పటికే ప్రశంసించింది. హరితహారంతో తెలంగాణ గత ఆరేళ్లుగా మంచి ఫలితాలను సాధించింది. గజ్వేల్‌లో సామాజిక అడవుల పెంపకం మంచి ఫలితాలను ఇచ్చి, ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలిచింది. దీంతో ఈ యేడు మరోమారు హరితహారం కోసం తెలంగాణ సిద్ధం అవుతోంది. పచ్చదనాన్ని కోరుకునే నాయకుడిగా కెసిఆర్ చేస్తున్న కృషి వల్ల తెలంగాణలో మొక్కల పెంపకం ఏటా పెరుగుతోంది. రాష్ట్రంలో పచ్చదనానికి ఇస్తున్న ప్రాధాన్యతను అటవీ శాఖ అధికారులు గుర్తించి ముందుకు సాగుతున్నారు. హైదరాబాద్-విజయవాడ, హైదరాబాద్-బెంగుళూరు జాతీయ రహదారుల వెంట ఇప్పటికే పచ్చదనం కోసం అటవీశాఖ చేపట్టిన మొక్కల పెంపకంతో ఈ ప్రాంతం పచ్చగా కనిపిస్తోంది. జాతీయ రహదారుల నిర్వహణ చూస్తున్న ఏజెన్సీలు భద్రతతో పాటు, అటవీ శాఖ నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను కూడా పంచుకోవాల్సి ఉంది.మొక్కలు నాటడం, వాటిని సాకడంపై ప్రధానంగా దృష్టి సారించడంతో నాటిన మొక్కలు ఏపుగా పెరుగుతున్నాయి. అలాగే జాతీయ రహదారులను ఆనుకుని మొక్కల పెంపకం పెద్దెత్తున చేపడుతున్నారు. ప్రభుత్వ చర్యలు బాగున్నాయని గతంలో నేషనల్ హై వేస్ అథారిటీ గ్రీన్ మిషన్ సలహాదారు ఏకే భట్టాచార్య ప్రశంసించారు. జాతీయ రహదారుల నిర్మాణం, పచ్చదనం ఆవశ్యకతను తెలంగాణ గుర్తించి ముందుకు వెళుతోందని గుర్తించారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా జాతీయ రహదారులు నిర్మించటం ఎంత ప్రధానమో, వాటి వెంట పచ్చదనాన్ని అభివృద్ధి చేస్తూ పర్యావరణాన్ని రక్షించుకోవటం కూడా అంతే ముఖ్యం.దేశ వ్యాప్తంగా జాతీయ రహదారుల విస్తరణ వేగంగా జరుగుతోంది. తెలంగాణలో పెద్ద సంఖ్యలో జరుగుతున్న జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర సహకరిస్తోంది. .



ఉపాధి, అభివృద్ధికి ఈ రహదారులు మార్గాలుగా మారాయి. వచ్చే పదేళ్లలో ఈ విస్తరణ వేగాన్ని మరింత పెంచాలన్న నీతి ఆయోగ్ ఇప్పటికే సూచనలు చేసింది. జాతీయ రహదారులు పెరిగితే అదే స్థాయిలో ట్రాఫిక్ తో పాటు, అవి వెలువరించే కర్బన ఉద్గారాలు కూడా పెరుగుతాయి. వీటి ప్రభావాన్ని తగ్గించటంమే మిషన్ గ్రీన్ హై వేస్ లక్ష్యం. దేశవ్యాప్తంగా ఉన్న ట్రాఫిక్ లో 40 శాతం నిత్యం జాతీయ రహదారుల గుండా వెళ్తోంది. రోడ్ల విస్తరణలో చెట్ల తొలగింపును వీలైనంత తగ్గించటం, అవసరమయితే భారీ చెట్లను మరోచోట నాటే పద్దతైన ట్రాన్స్ ప్లాంటేషన్‌కు వెళ్లటం, నిర్మాణం పూర్తయిన రోడ్ల వెంట పెద్ద సంఖ్యలో చెట్లను పెంచటం ఈ సమస్యకు పరిష్కారంగా పనిచేస్తున్నారు. అభివృద్ధి, రోడ్ల నిర్మాణం వల్ల వన్యప్రాణులను నష్టం కలగకుండా చూడాల్సి ఉంది. పచ్చదనం కోసం తీసుకుంటున్న చర్యల్లో కార్పోరేట్, స్వచ్చంద సంస్థలతో పాటు ప్రజా భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడంతో సమస్యను అధిగమించేలా చేయాల్సి ఉంటుంది. అయితే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా జాతీయ రహదారుల వెంట మొకలు పెంపకం మంచి ఫలితాలను ఇస్తోంది. అటవీ శాఖ కొత్త పద్దతిలో చేపట్టిన ఎవెన్యూ ప్లాంటేషన్ మంచి ఫలితాలు ఇస్తోంది. హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారి యాదగిరిగుట్ట వరకు పూర్తి అయినందున అక్కడి వరకు వెంటనే గ్రీనరీ చర్యలతో పాటు, వరంగల్ దాకా భవిష్యత్‌లో మొక్కల పెంపకం, హైదరాబాద్- అదిలాబాద్ రహదారి వెంట అదనపు పచ్చదనం కోసం ప్రతిపాదనలు తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి నివేదించింది.

నటి ఆయేషా సుల్తానాపై దేశద్రోహం కేసు



తిరువనంతపురం, జూన్11 :సినీనటి, దర్శకురాలు ఆయేషా సుల్తానాపై దేశద్రోహం కేసు నమోదైంది. కరోనా వైరస్ గురించి విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసినందుకుగానూ ఆమె మీద ఈ కేసు నమోదైనట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ మలయాళ టీవీ చర్చాకార్యక్రమంలో పాల్గొన్న ఆయేషా.. లక్షద్వీప్ ప్రజలపై కేంద్ర ప్రభుత్వం కోవిడ్ -19ను ఒక జీవాయుధంగా ప్రయోగించిందని సంచలన ఆరోపణలు చేసింది. ఇందుకోసం అడ్మినిస్ట్రేటర్ ప్రఫుల్ ఖోడా పటేల్‌ను బయోవెపన్‌గా వాడిందని పేర్కొంది. ఆమె మాటలపై ఆగ్రహం వ్యక్తం చేసిన లక్షద్వీప్ బీజేపీ యూనిట్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఇది కేంద్ర ప్రతిష్టను దిగజార్చడమేనని అభిప్రాయపడ్డాడు. విద్వేషపూరిత వ్యాఖ్యలు చేసిన ఆమెపై తక్షణమే చర్యలు తీసుకోవాలంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఆయేషాపై దేశద్రోహం కేసు నమోదు చేశారు.

సైబర్ క్రైమ్‌లో చిక్కుకున్న డాక్టర్

యువతి మాటలు నమ్మి 24 లక్షలకు టోపీ

హైదరాబాద్,జూన్11 : ఓ వైద్యుడు సైబర్ క్రైమ్ లో చిక్కుకుని రూ.24లక్షలు పోగొట్టుకున్నారు. కృష్ణానగర్‌కు చెందిన ఓ డాక్టర్ కు సోషల్ మీడియాలో ఇటీవల ఒక యువతి పరిచయమైంది. ఆమె పేరు మరియా అలెగ్జాండర్ అని పోలాండ్ దేశానికి చెందిన పెద్ద వ్యాపారవేత్త కూతురునని పరిచయం చేసు కుంది. తాను ఇక్కడ డాక్టర్ వృత్తిలో ఉన్నానని నమ్మ బలికింది. స్నేహం పెరిగిన తర్వాత పెళ్లిచేసు కుందామంటూ చెప్పింది. అయితే ప్రేమకు గుర్తుగా వజ్రాలతో కూడిన ఖరీదైన గిఫ్ట్ పంపిస్తున్నానంటూ ఒక రోజు చెప్పింది. తర్వాత మూడు రోజులకు ఒక వ్యక్తి వైద్యుడికి ఫోన్ చేసి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ కస్టమ్స్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ట్యాక్సులు, జరిమానా చెల్లిస్తేనే అతనికి వచ్చిన గిఫ్ట్‌ను రిలీజ్ చేస్తామని చెప్పాడు. నమ్మిన వైద్యుడు వెంటనే రూ.24లక్షలను అతను సూచించిన బ్యాంకు ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఆ తర్వాత యువతి ఫేస్‌బుక్ ఖాతా మాయమైంది. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయానని గ్రహించిన వైద్యుడు సైబర్ క్రైమ్‌లో ఫిర్యాదు చేశాడు.

కరోనా కష్టకాలంలో అంబులెన్స్ సేవలు

ఉచితంగానే అందిస్తున్న వ్యక్తి

సంగారెడ్డి,జూన్11 :
కరోనా కాలంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారికి కొండంత అండగా నిలబడుతున్నవారెందరో ఉన్నారు. రియల్ హీరో అనిపించుకున్న సోనుసూద్ స్ఫూర్తితో ఎవరికి వారే తమకు తోచే సాయం చేసేందుకు స్వచ్ఛంధంగా ముందుకు వస్తున్నారు. మన అనుకున్నవాళ్లే పట్టించుకోని కష్ట కాలంలో తామున్నామంటూ ముందుకొస్తున్నారు. కరోనా సెకండ్ వేవ్‌లో హృదయాన్ని కలిచివేసే ఎన్నో ఘటనలు జరిగాయి. ఇలాంటివి చూసి చలించిపోయిన సంగారెడ్డి జిల్లా, సదాశివపేటకు చెందిన అంజద్ తాను సయితం అంటూ ముందుకొచ్చాడు. ఓ అంబులెన్స్‌ను కొనుగోలు చేసి కరోనా బాధితులను సకాలంలో ఆస్పత్రికి తరలిస్తున్నాడు. సయ్యద్ అంజద్ చిరు వ్యాపారి ఏడేళ్ల క్రితం ఆయన మూడు నెలల కుమారుడు అనారోగ్యం పాలయ్యాడు. ఆరోగ్యం విషమిస్తుండడంతో తక్షణమే హైదరాబాద్ తరలించాలని వైద్యులు సూచించారు. అంబులెన్స్ డ్రైవర్ రూ. 3,500 అడగడంతో డబ్బులు లేక ఆలస్యమై చిన్నారి కన్నుమూశాడు. తన లాంటి కష్టం ఏ కన్నవారికి రాకూడదని భావించిన అంజద్.. ఉచిత అంబులెన్స్ నడపాలని అప్పుడే నిర్ణయించుకున్నాడట.. అప్పటి నుంచి డబ్బులు కూడబెట్టి రూ. 8 లక్షలు జమచేసి అనుకున్నది సాధించాడు. అప్పటి ఆలోచనే ఇప్పుడు కోవిడ్ రోగులకు వరంగా మారింది. బాధితుల నుంచి ఒక్క రూపాయి కూడా ఆశించకుండా ఇప్పటి వరకు సుమారు 2 వందల మంది బాధితులకు ఉచిత సహాయం అందించాడు. కోవిడ్‌తో మరణించి వారి మృతదేహాలు తీసుకువెళ్లేందుకు వారి కుటుంబసభ్యులు రాకుంటే.. ఆ బాధ్యత కూడా అంజద్ నిర్వహిస్తున్నాడు. అలాగే ప్రతి రోజు పేదలు 150 మంది వరకు అన్నదానం చేస్తున్నాడు.





ఆదర్శ తెలంగాణ నిర్మాణమే కెసిఆర్ లక్ష్యం

ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్,జూన్11 :
తెలంగాణను దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు సీఎం కేసీఆర్ తీవ్రంగా కృషి చేస్తున్నారని ఎక్సైజ్ శాఖ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత వివిధ రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించినట్లు వివరించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 15 మంది లబ్దిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం కింద రూ. 11 లక్షల 16 వేల చెక్కులను మంత్రి లబ్దిదారులకు అందజేశారు.
అంతకుముందు మంత్రి మహబూబ్ నగర్ మున్సిపల్ పరిధిలోని భగీరథ కాలనీలో రూ.12 లక్షల వ్యయంతో నిర్మించనున్న మురికి కాలువల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
వీరన్న పేటలో హెచ్.ఎన్ ఫంక్షన్ హాల్ సమీపంలో ముస్లిం గ్రేవ్ యార్డ్ అభివృద్ధి కోసం రూ. 13 లక్షలతో చేపట్టిన పనులకు శంకుస్థాపన చేశారు. టి.డి గుట్ట చౌరస్తా వద్ద రూ.17.50లక్షలతో చేపట్టనున్న సి.సి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.
అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. ఎంతోమంది పేద ప్రజలకు వారి ఆరోగ్య సంక్షేమం దృష్ట్యా రూ. లక్ష నుంచి రూ. 10 లక్షలకు పైగా సీఎంఆర్ఎఫ్ కింద ఇస్తున్నామన్నారు. గతంలో జబ్బు చేస్తే పేద వారు చాలా ఇబ్బందులు ఎదుర్కోవలసి వచ్చేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక వివిధ రంగాలలో ఎంతో అభివృద్ధి సాధించామని మంత్రి తెలిపారు. ముఖ్యమంత్రి అన్ని వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారని తెలిపారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎస్.వెంకట రావు, మున్సిపల్ చైర్మన్ కె.సి. నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్ కుమార్, ఇతర అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పల్లెప్రగతిని నిరంతరంగా కొనసాగించాలి

పెద్దపల్లి,జూన్11 : పల్లె ప్రగతి కార్యక్రమ స్ఫూర్తిని ప్రజలు నిరంతరం కొనసాగించాలని ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సూచించారు. హరితహారంలో భాగంగా గ్రామాల్లో విరివిగా మొక్కలను పెంచడానికి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. గ్రామంలో నర్సిరీని సందర్శించి మొక్క ల పెంపకంపై వివరాలు తెలుసుకున్నారు.వర్షాకాలాన్ని దృష్టి లో ఉంచుకొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ, నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. లాక్‌డౌన్ స డలింపులతో కరోనా ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలంతా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే అందరూ సమష్టిగా కృషి చేయాలని అన్నారు. ప్రభుత్వ ముందుచూపుతో వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా నిర్వహిస్తున్న ఇంటెన్సివ్ శానిటేషన్ డ్రైవ్ సత్ఫలితాలు ఇస్తుందని అన్నారు. ఇంటెన్సివ్ శానిటేషన్ డ్రైవ్‌లో భాగంగా పారిశుధ్యం మెరుగుపడడంతో పాటు నగరంలోని 18 ప్రధాన కాలువల్లో పూడిక తొలగించామన్నారు. పట్టణ ప్రగతిలో భాగంగా అదనంగా సిబ్బంది, వాహనాలు అద్దె ప్రాతిపదికన సమకూర్చుకొని శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

ములుగు అటవీ కాలేజీకి అరుదైన గౌరవం

గ్రీన్ ఛాంపియన్ అవార్డుకు ఎంపిక




హైదరాబాద్,జూన్11 : సిద్దిపేట జిల్లాలోని ములుగు అటవీ కళాశాల, పరిశోధనా సంస్థకు మరో గుర్తింపు లభించింది. జాతీయ స్థాయిలో స్వచ్ఛత, పచ్చదనం పోటీలో ములుగు ఫారెస్ట్ కాలేజీ గ్రీన్ ఛాంపియన్‌గా నిలిచింది. మహాత్మా గాంధీ నేషనల్ కౌన్సిల్ ఆఫ్ రూరల్ ఎడ్యుకేషన్ నిర్వహించిన ఒక జిల్లా – ఒక పచ్చని విజేత అవార్డును ములుగు ఫారెస్ట్ కాలేజీ సాధించింది. జాతీయ స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలో ఒక్కో జిల్లా నుంచి ఒక సంస్థను పరిశుభ్రత, పచ్చదనం పెంపు నిర్వహణ బాగా చేస్తున్న వాటిని గుర్తించారు. దీనిలో భాగంగా సిద్దిపేట జిల్లా నుంచి ములుగులో ఉన్న అటవీ కళాశాల, పరిశోధనా సంస్థ అవార్డును దక్కించుకుంది. కొత్త క్యాంపస్ ఏర్పాటైన ఏడాది కాలంలోనే స్వచ్ఛత, పచ్చదనంలో ఫారెస్ట్ కాలేజీ గణనీయమైన వృద్ధిని సాధించింది. కాలేజీ యాజమాన్యం, సిబ్బంది, విద్యార్థులు ఈ ఘనతలో భాగస్వామ్యం అయ్యారు. జాతీయ స్థాయిలో ఈ గుర్తింపుకు ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రోత్సాహం, ఫ్యాకల్టీ, విద్యార్థుల పట్టుదల కారణమని ఫారెస్ట్ కాలేజీ డీన్ ప్రియాంక వర్గీస్ అన్నారు. మరో సారి ఫారెస్ట్ కాలేజీకి జాతీయస్థాయి గుర్తింపు దక్కడంతో డీన్, సిబ్బంది, విద్యార్థులను అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, పీసీసీఎఫ్ ఆర్. శోభ అభినందించారు.

విఐఎల్‌ను వేదాంతకు ఎలా కట్టబెడతారు

ప్రజల సొమ్ముకు భద్రత లేదా: సీతారాం ఏచూరి

న్యూఢిల్లీ,జూన్11 : వీడియోకాన్ ఇండిస్టీస్ లిమిటెడ్ విఐఎల్‌ను వేదాంత గ్రూపునకు కట్టబెట్టడంపై సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మండిపడ్డారు. బ్యాంకుల్లో ప్రజలు దాచుకున్న సొమ్మును మోడీ సర్కార్ కొల్లగొడుతోందని విమర్శించారు. వీడియోకాన్‌ను వేదాంత రూ. 2,962 కోట్లకు



కొనుగోలు చేయడంపై ఆయన ట్విట్టర్ ద్వారా స్పందించారు. విఐఎల్‌ను వేదాంత కొనుగోలు చేసేందుకు అంగీకరించిన బ్యాంకులు సైతం రూ. 40 వేల కోట్లకు పైగా బకాయిలను మాఫీ చేయడాన్ని ఆయన తీవ్రంగా తప్పుబట్టారు. మోడీ మద్దతు కల్గిన ఆశ్రిత పెట్టుబడుల దోపిడీ కారణంగా ప్రజల పొదుపు సొమ్మును, బ్యాంకులు 40వేల కోట్ల ఆస్తులను కోల్పోతాయని తెలిపారు. ఈ విధంగా జాతీయ ఆస్తులను, ప్రజల సంపదను కొల్లగొడుతున్నారని మోడీ సర్కార్‌ను విమర్శించారు.

కరోనా బాధితులకు అండ

అభినందనలు తెలిపిన కవిత

నిజామాబాద్,జూన్11 : కరోనా సమయంలో బాధితులకు అండగా నిలుస్తున్న వారు దేవుళ్లతో సమానమని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఎందరో దాతలు ముందుకు వచ్చి తమకు తోచిన విధంగా ఆదుకుంటున్నారని అన్నారు. ప్రభుత్వం కరోనా కట్టడిక తీసుకుంటున్న చర్యలకు తోడు వివిధ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ కవిత శుక్రవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా పులాంగ్ చౌరస్తాలోని



పులాంగ్ పార్క్‌ను ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. పార్కు నిర్మాణ పనులను అధికారులను అడిగి తెలుసుకున్నారు. పార్కు సందర్శన కంటే ముందు.. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్త అధ్వర్యంలో చేపట్టిన ఉచిత భోజన వితరణ ముంగింపు కార్యక్రమంలో ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. భోజన వితరణ కార్యక్రమం చాలా గొప్పది అని పేర్కొన్నారు. కరోనా సమయంలో ఈ కార్యక్రమం చాలా మందికి ఉపయోగపడుతుందన్నారు. ఇంకా కొద్ది రోజులు జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటే కరోనా ఛాలెంజ్‌ను ఎదుర్కోవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించి, భౌతిక దూరం పాటించాలన్నారు.

చౌడాపూర్ మండలాన్ని ప్రారంభించిన మంత్రి సబిత

కొత్త మండలం ఏర్పాటుపై సిఎం కెసిఆర్‌కు కృతజ్ఞతలు

వికారాబాద్,జూన్11 : జిల్లాలోని పరిగి నియోజకవర్గంలో ఏర్పాటు అయిన నూతన చౌడాపూర్ మండలాన్ని విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంతో పాటు మండల వనరుల కేంద్రం, అంగన్ వాడీ కేంద్రం, గ్రామ పంచాయతీ భవనం, వ్యవసాయ శాఖ కార్యాలయ భవనాలను ప్రారంభించి చౌడాపూర్ మండల ప్రజలకు అంకితం చేశారు. చౌడాపూర్ ప్రజల చిరకాల వాంఛ నెరవేర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మండల ప్రజలు ధన్యవాదాలు తెలిపారు. అంతకు ముందు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి మంత్రి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి , జిల్లా కలెక్టర్ పౌసుమి బసు, డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణా రెడ్డి, అడిషనల్ కలెక్టర్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు

నిజామాబాద్,జూన్11 : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జడ్పీ చైర్మర్ దాదన్నగారి విఠల్‌రావు అన్నారు. కరోనా కారణంగా ప్రజలు స్వచ్ఛతకు అలవాటు పడ్డారని, అది వీధుల్లోనూ కొనసాగించాలన్నారు.



త్వరలో ప్రారంభమయ్యే హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాటర్ ట్యాంకులు, పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్, కార్యదర్శి, పంచాయతీ సిబ్బందికి సూచించారు. మురికి కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లాలని, పట్టణంలో సోడియం హైపోక్లోరైట్ ద్రావణం పిచికారీ చేయించాలని మున్సిపల్ కమిషనర్ గంగాధర్‌కు సూచించారు. పట్టణంలో కొనసాగుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లోని వీధుల్లో పారిశుద్ధ్య పనులను, డంపింగ్ యార్డు, కంపోస్టు షెడ్డు, హరితహారంలో నాటిన మొక్కలను పరిశీలించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో పట్టణ ప్రగతి పనులు చురుగ్గా కొనసాగాయన్నారు.

ధాన్యం కొనుగుల కేంద్రా వద్ద రైతులకు షర్మిల పరామర్శ

కాన్వాయ్‌లో రెండు వాహనాలకే పోలీసులు అనుమతి

వికారాబాద్,జూన్11 : వికారాబాద్ జిల్లా దోమ మండలం పాలెపల్లిలోని వరి కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పరిశీలించారు. రైతులతో పాటు నేలపై కూర్చొని రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వరి కొనుగోలు కేంద్రం వద్ద వారు పడుతున్న సమస్యలను రైతులు షర్మిలకు వివరించారు. తేమ



శాతం, తాళు అంటూ మూడు నుంచి ఐదు కిలోల వరకూ తరుగు తీస్తున్నారని రైతులు షర్మిల వద్ద ఆవేదన వ్యక్తం చేశారు.అంతకుముందు వికారాబాద్ జిల్లా చింతపల్లి దగ్గర వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల కాన్వాయ్‌ను పోలీసులు నిలిపివేశారు. శుక్రవారం ఉదయం లోటస్‌పాండ్ నుంచి షర్మిల పరిగికి బయల్దేరారు. కొవిడ్ కారణంగా షర్మిల కాన్వాయ్‌లో రెండు వాహనాలకే అనుమతి లభించింది. దీంతో కాన్వాయ్‌లోని ఇతర వాహనాలను చింతపల్లి దగ్గర పోలీసులు నిలిపివేశారు. ఈ సందర్భంగా కాసేపు పోలీసులకు, వైఎస్సార్‌టీపీ నేతలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ప్రతిపక్షాల అసత్య ప్రచారం తిప్పికొడతామంటూ.. దోమ మండలం టీఆర్ఎస్ శ్రేణులు ప్రకటన చేశాయి. పాలెపల్లి ఐకేపీ సెంటర్ దగ్గర పోలీసులు భారీగా మోహరించారు.

తెలంగాణ ప్రజల గుండె చప్పుడు టీఆర్ఎస్

కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన కవిత

నిజామాబాద్,జూన్11 : తెలంగాణ ప్రజల గుండె చప్పుడు టీఆర్ఎస్ అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తెలిపారు. నిజామాబాద్‌లో వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ కవిత, టీఆర్ఎస్ నూతన కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. పార్టీ ఆవిర్భావం నుంచి తెలంగాణ ప్రజల ఆకాంక్షలను దేశవ్యాప్తంగా తెలియజేస్తూ, నిరంతం ప్రజల కోసం పనిచేస్తున్నామని ఎమ్మెల్సీ తెలిపారు. ప్రజల ఆశీస్సులతో రెండు సార్లు అధికారంలోకి వచ్చిన టీఆర్ఎస్ తెలంగాణను దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో టీఆర్ఎస్ కార్యాలయాలు నిర్మిస్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలోని కార్యకర్తలకు అండగా నిలుస్తామన్నారు. కార్యాలయాల్లో ఉండే సిబ్బంది, ఇన్సూరెన్స్ లాంటి అనేక అంశాల్లో కార్యకర్తలకు సహాయసహకారాలు అందిస్తారని కవిత పేర్కొన్నారు. అంతేకాదు దేశంలోని బలమైన ప్రాంతీయ పార్టీల్లో ఒకటిగా టీఆర్ఎస్



నిలిచిందన్నారు. క్యాంపు కార్యాలయంలో అనేకమంది కార్యకర్తలు, ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్సీని కలిసారు. ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను స్వీకరించిన ఎమ్మెల్సీ కవిత వారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. నిజామాబాద్ రూరల్, బోర్గాం పి.గ్రామంలో ఎమ్మెల్యే జాజిరెడ్డి గోవర్ధన్ తో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు ఉమారాణి, సాయరాం, జర్నలిస్టు బాలులను ఎమ్మెల్సీ పరామర్శించారు.

ఢిల్లీ ప్రభుత్వం కీలక నిర్ణయం: మద్యం డోర్ డెలివరీకి ఆమోదం

న్యూఢిల్లీ,జూన్11 : ఇప్పటివరకు ఫుడ్ డెలివరీ, నిత్యావసర సరుకుల డోర్ డెలివరీ మాత్రమే తెలుసు. అయితే ఢిల్లీ ప్రభుత్వం కొత్త పద్ధతికి తెర లేపింది. ఇక నుంచి మద్యాన్ని ఇంటికే పంపిణీ చేయనున్నారు. దీనికి



సంబంధించిన నిబంధనలు ఢిల్లీలో శుక్రవారం నుంచి అమల్లోకి వచ్చాయి. మద్యం విక్రేతలు మద్యాన్ని డోర్ డెలివరీ చేయడానికి నిబంధనల ప్రకారం ఎల్ –13 లైసెన్స్ కలిగి ఉండాలి. కాగా ఎల్–13 లైసెన్స్ కోసం నేటి నుంచి దరఖాస్తు చేసుకోవచ్చు. ఇక మద్యం ఇంటికి ఆర్డర్ చేసుకునే ప్రక్రియ ఇంకా ప్రారంభంకాలేదు. మద్యం విక్రేతలకు ఎల్ –13 లైసెన్స్ జారీ చేసిన తర్వాత ఈ ప్రక్రియ మొదల వుతుంది. ఢిల్లీ ప్రభుత్వం జూన్ 1న ఎక్సైజ్ నిబంధనలను సవరించిన సంగతి తెలిసిందే. భారతీయ, విదేశీ బ్రాండ్ల మద్యాన్ని మొబైల్ యాప్స్ లేదా ఆన్‌లైన్ వెబ్ పోర్టల్స్ ద్వారా ఇంటికి పంపిణీ చేయడానికి అనుమతించింది. అయితే మద్యాన్ని నేరుగా ఇంటికే పంపిణీ చేయాలని పేర్కొంది. హోస్టల్స్, కార్యాలయాలు, సంస్థలకు డెలివరీ చేయవద్దని ఢిల్లీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏప్రిల్ 19న ఢిల్లీ సీఎం అరవింద్ కేజీవ్రాల్ లాక్‌డౌన్ ప్రకటించినప్పటి నుంచి మద్యం షాపులు, మాల్స్, మార్కెట్లు మూసివేశారు..

ఉచిత విద్యుత్ కింద అందరికీ న్యాయం: గంగుల

హైదరాబాద్,జూన్11 : రాష్ట్రంలోని రజక, నాయీ బ్రాహ్మణ సంఘాలతో మంత్రి గంగుల కమలాకర్ తన కార్యాలయంలో సమావేశమయ్యారు. 250 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం విధివిధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి మేలు చేస్తామన్నారు. ఇప్పటి వరకు 200 దరఖాస్తులు మాత్రమే వచ్చాయని తెలిపారు. వీలైనంత త్వరగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

సూర్యాపేటలో కల్నల్ సంతోష్ బాబు విగ్రహం

15న ప్రారంభించేందుకు ఏర్పాట్లు

సూర్యాపేట,జూన్11 : దేశం కోసం ప్రాణాలర్పించిన కల్నల్ సంతోష్ బాబు విగ్రహాన్ని ఈ నెల 15న సూర్యాపేట పట్టణంలో ఆవిష్కరించనున్నారు. ఈ



మేరకు సూర్యాపేటలోని కోర్ట చౌరస్తాలో ఏర్పాట్లను మంత్రి జగదీశ్ రెడ్డి పరిశీలించారు. తెలంగాణకు, సూర్యాపేట గడ్డకు పేరు ప్రఖ్యాతులను తీసుకొచ్చిన కల్నల్ సంతోష్ బాబు విగ్రహం ప్రతి ఒక్కరిలో స్ఫూర్తిని నింపేలా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. గత జూన్‌లో లఢక్‌లోని గల్వాలన్ లోయలో చైనా ఆర్మీతో జరిగిన పోరాటంలో ప్రాణాలొదిలిన సంతోష్ బాబు కుటుంబానికి.. సీఎం కేసీఆర్ కొండంత భరోసాను, ధైర్యాన్ని అందించారని చెప్పారు. వారి కుటుంబ సభ్యుల కోరిక మేరకు సూర్యపేట పట్టణంలోని కోర్ట్ చౌరస్తాకు కల్నల్ సంతోష్ బాబు చౌరస్తాగా నామకరణం చేశామని, చౌరస్తాను అందంగా సుందరీకరణ చేసినట్లు వెల్లడించారు.

పాలిసెట్ దరఖాస్తుల గడువు పొడిగింపు

హైదరాబాద్,జూన్11 : పాలిసెట్ ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఆలస్య రుసుము లేకుండా ఈనెల 18 వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉందని సెట్ కార్యదర్శి శ్రీనాథ్ పేర్కొన్నారు. రూ. 100 ఆలస్య రుసుముతో ఈనెల 20 వరకు, రూ. 300 ఆలస్య రుసుముతో ఈనెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. ఇంకా పరీక్ష నిర్వహణ తేదీని ఖరారు చేయలేదని, త్వరలో తేదీని ప్రకటిస్తామని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని పాలిసెట్ కార్యదర్శి శ్రీనాథ్ సూచించారు.

హరితహారం లక్ష్యాలను గుర్తించాలి

కరీంనగర్,జూన్11 : హరితహారంలో మొక్కలు నాటేందుకు శాఖల వారీగా ప్రదేశాలను గుర్తించాలని అధికారులు ఆదేశించారు. శాఖల వారీగా నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం స్థలాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. ఇసుక బుకింగ్, డెలివరీలో తలెత్తుతున్న సాంకేతిక సమస్యలు అధిగమించా లన్నారు. వైద్యులు, సిబ్బంది, ఏఎన్ఎం, ఏఎస్‌హెచ్ఏ కార్యకర్తలు వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవాలని శంకర సూచించారు. రానున్నరోజుల్లో కోవిడ్ కేసులు పెరిగే అవకాశం ఉందన్నారు. పాజిటివ్ కేసులకు కరీంనగర్‌లో చికిత్స అందించడానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లాకు మంజూరైన 6,494 డబుల్‌బెడ్ రూం ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హత గల రుణగ్రహీతలందరికీ ఆత్మనిర్భర్ భారత్ అభియాన్ ప్యాకేజీ కింద రుణాలు పొడిగించినట్లు తెలిపారు.

సినారె వర్ధంతి సందర్భంగా నేడు అక్షర నివాళి



హైదరాబాద్,జూన్11 : జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, మహాకవి డా. సి.నారాయణరెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని తెలంగాణ సారస్వత పరిషత్ , డా. సి.నారాయణరెడ్డి వంశీ విజ్ఞాన పీఠం, కేతవరపు ఫౌండేషన్, సంతోషం ఫిల్మ్ న్యూస్ సంయుక్తంగా శనివారం సాయంత్రం 5 గంటలకు అంతర్జాలంలో టైనెట్ లైవ్ టీవీ, సంతోషం లైవ్ ద్వారా 'సినారె' కు అక్షర సుమాంజలి సమర్పించనున్నారు. సినారె కృతులపై వివిధ విశ్వవిద్యాలయాలలో పరిశోధన చేసిన విద్వాంసుల ప్రసంగాలు ఉంటాయి.ఈ అపూర్వ నివాళి కార్యక్రమంలో పరిశోధనలు చేసిన డాక్టర్ ఎం కె రాము, డా.వి.ఎల్ నరసింహారావు, డా.నల్లా ప్రభావతి దేవి, డా.నందినేని రవీందర్ ప్రసంగించబోతున్నారు .ఈ కార్యక్రమంలో ఆచార్య ఎల్లూరి శివారెడ్డి , భువనచంద్ర , డా. జుర్రు చెన్నయ్య , కళాబ్రహ్మ డా. వంశీ రామరాజు, డా. కేతవరపు రాజ్యశ్రీ పాల్గొంటారు.

పట్టణంలో పారిశుధ్యానికి ప్రాధాన్యం: ఛైర్మన్

ఆదిలాబాద్,జూన్11 : సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. పట్టణంలో పారిశుద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నామని అన్నారు. పట్టణ ప్రగతిలో ప్రజలను చైతన్యం చేసే కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. అన్ని వార్డుల్లో ఇప్పటికే ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమం క్రమం తప్పకుండా చేపడుతున్నామన్నారు. పరిసరాల పరిశుభత పాటించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందుస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. మున్సిపల్ ద్వారా ఫాగింగ్ చేస్తున్నట్లు చెప్పారు. వానకాలంలో పట్టణంలో దోమల నివారణ కోసం ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. వార్డుల్లో హైరిస్క్ ఏరియాలు గుర్తించామని పేర్కొన్నారు. వారంలో రెండు రోజులు అన్ని వార్డుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేస్తామని చెప్పారు.

గిరిజనులకు రక్షణ ఇవ్వని ప్రత్యేక చట్టాలు

వారి అభివృద్ధికి కానరాని చిత్తశుద్ధి

విశాఖపట్టణం,జూన్11 : జనాభా లెక్కల దేశ వ్యాప్తంగా దాదాపుగా 10 కోట్ల మంది గిరిజనులు ఉన్నారు. దేశ జనాభాలో దాదాపు 8.6 శాతం వున్న వీరిలో అత్యధికులు ఇప్పటికీ అభివృద్ధికి, నాగరికతకు దూరంగా ఉన్నారు. ఈ వెనుకబాటు తనాన్ని రూపుమాపడమే లక్ష్యంగా రాజ్యాంగం వీరికి ప్రత్యేక రక్షణలను కల్పించింది. ప్రత్యేక చట్టాలను చేసే అధికారాలను ప్రభుత్వాలకు ఇచ్చింది. తెలుగు రాష్ట్రాల్లో గిరిజన భూములను



అన్యాక్రాం తం కాకుండా చూసేందుకు 1/70 వచ్చింది. గిరిజన నివాస ప్రాంతాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను నూరు శాతం వారికే కేటాయిస్తూ జారీ అయిన 3 నెంబర్ జీవోను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటి నుండే స్థానికుల్లో ఆందోళన నెలకొంది. గిరిపుత్రులు పోరాడి సాధించుకున్న హక్కుల స్ఫూర్తికి విరుద్ధంగా 3వ నెంబర్ జీవో కు సుప్రీంకోర్టు తీర్పు చెల్లుచీటి రాసింది. అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పు కేవలం ఉద్యోగ అవకాశాలకే పరిమితం కాదు. అనేక రకాలుగా వారి జీవితాలను ప్రభావితం చేస్తుంది. ప్రాథమిక స్థాయి పాఠశాలల్లో స్థానికేతరులకు అవకాశం కల్పించడమంటే గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలకు సవాల్ విసరడంతో పాటు భవిష్యత్తునూ ప్రశ్నార్థకం చేయడమే కాగలదన్న ఆందోళన వారిలో నెలకొంది. స్వాతంత్ర్యం వచ్చిన 1947 నుండి 1986 వరకు గిరిజనేతరులే ఈ ప్రాంతాల ఉద్యోగాల్లో ఆధిపత్యం చలాయించారు. స్థానిక భాషల్లో మాట్లాడే గిరిజన ఉపాధ్యాయుల వల్లనే అనేకమంది చదువుకుంటున్నారని సాక్షాత్తు కేంద్ర ప్రభుత్వమే 2017లో ఒక నివేదిక రూపొందించింది. జీవో నెంబర్ 3 పునరుద్ధరణతో పాటు, గిరిజనుల హక్కుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం గట్టిగా నిలబడాలి. అభివృద్ధి పేరిట నిర్మితమయ్యే ప్రాజెక్టుల్లో నిర్వాసితులయ్యేది గిరిజనులే. అడ్డగోలు మైనింగ్ అనుమతులతో ఛిద్రమౌతున్నది వారి బతుకులే. ఇప్పుడీ జీవో నెం.3 రద్దుతో వారి ముందున్న కొద్దిపాటి అవకాశాలనూ కోల్పోతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు స్పందిస్తేనే వారికి న్యాయం జరుగుతుంది. గిరిజన ప్రాంత ఉద్యోగ నియామకాల్లో వంద శాతం అవకాశాలను గిరిజనులకే కల్పించే 3వ నెంబర్ జీవోను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు.

సన్మార్గమే జీవిత లక్ష్యం కావాలి (ఆధ్యాత్మిక చింతన)

తిరుమల,జూన్11 : మానవచరిత్రలో ఎందరో మహానుభావులు తమ గుణగుణాలతో రాణించి, ప్రపంచాన్ని ప్రభావితం చేసి అద్భుతాలను సృష్టించారు. అందుకు వారి వ్యక్తిత్వాలే కీలకంగా నిలిచాయని చెప్పవచ్చు. మనిషికున్న సిరిసంపదలు, చదువులు ముఖ్యం కాదు. మంచి గుణాలు మేధో, ఆధ్యాత్మిక సంపదతో కూడిన వ్యక్తిత్వమే మనిషిని మహనీయునిగా మారుస్తుంది. అలాంటి గొప్ప వ్యక్తిత్వం గురించి చెప్పుకోవాలంటే మనకు గుర్తొచ్చే మొదటి పేరు శ్రీరాముడిదే. రామాయణంలో ఎన్నో ఘట్టాల్లో రాముని మృదుస్వభావం, బలగర్వం లేని వినయం, వివక్ష లేని ఆప్యాయత కనిపిస్తాయి. ఉదాహరణకు తన వనవాసానికి కారణమైన కైకేయిని మిగతావారు ద్వేషించారేమో కానీ రాముడు మాత్రం ఆమె ఆదేశాలను ఆనందంగా స్వీకరించారు. శబరి ఎంగిలి చేసిచ్చిన పండ్లను తృప్తిగా ఆరగించడం, తండ్రికి ఇచ్చిన మాటను నెరవేర్చకుండా అయోధ్యకు తిరిగిరానని చెప్పి వనవాసాన్ని కొనసాగించడం.. ఇవన్నీ రాముడి వ్యక్తిత్వానికి అద్దం పట్టే ఘట్టాలే. అందుకే రాముడు ఆదర్శ పురుషుడయ్యాడు. దీనినే సానుకూల ఆలోచనగా చెబుతారు. అంటే పాజిటివ్‌గా స్వీకరించే మనస్తత్వం అలవర్చుకుంటే దానికి మించిన మహాభాగ్యం లేదు. ఈ ప్రపంచంలోని ప్రజలంతా అందరి మేలును తన మేలుగా భావిస్తూ శత్రువులను, మిత్రువులను సమంగా చూసేగుణాన్ని కలిగి ఉండాలని భగవద్గీత ఏనాడో చెప్పింది. సమభావన కలిగి ఉండాలని చెబుతోంది. అంటే మనిషి రూపు రేఖలు, కులగోత్రాలు ప్రధానం కాదు.. నలుగురి మంచిని కోరి అందరినీ సమానంగా చూడడమే మానవధర్మం. అదే మనిషి వ్యక్తిత్వానికి గుర్తుగా నిలుస్తుందనేది అంతరార్థం. ఒకరి నడవడిక, ఆలోచనా విధానాలు, వాటిని వ్యక్తపరిచే విధానమే వారి వ్యక్తిత్వం అవుతుంది. క్రమశిక్షణ లేని మనసు శత్రువుగా మారుతుంది. చక్కని శిక్షణ పొందిన మనసు మనిషికి స్నేహితునిగా వ్యవహరించి మంచిపేరు తెస్తుందని భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్ముడు ఉద్బోధించాడు. ఆధునిక కాలంలో అన్నీ సమకూర్చుకున్న మనిషి మాత్రం ఏదో ఆందోళన చెందడానికి కారణం ఆధ్యాత్మిక స్పృహ కోల్పోవడమే. ప్రస్తుత కాలంలో జరిగే చాలా అనర్థాలకు కారణం కూడా అదే. మంచి వ్యక్తిత్వ నిర్మాణం కోసం మహనీయుల జీవిత చరిత్రలు చదివి, వారి మంచి గుణాల్లో కొన్నింటినయినా అనుకరించి ప్రయత్నించాలి.

చేయూత పథకానికి ఆధార్ నమోదు

విజయవాడ,జూన్10 : వైఎస్సార్ చేయూత పథకం కింద ఆర్థిక సాయం కోసం ఆధార్‌తో ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవడానికి, కొత్తగా అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 11వ తేదీ వరకు గడువు పొడిగించింది. ముందుగా ప్రకటించినట్టు ఈ నెల 8వ తేదీనే గడువు ముగిసింది. అయితే జిల్లాల్లో తగినన్ని ఆధార్ కేంద్రాలు లేకపోవడం, కరోనా వైరస్ కారణంగా కర్ఫ్యూ విధించడంతో చాలా మంది మహిళలు ఆధార్‌తో ఫోన్ నంబర్లను అనుసంధానం చేసుకోలేదు. దీంతో గడువును పెంచుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. 45 సంవత్సరాల పైబడిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన మహిళలకు ఆర్థిక ఆసరా కోసం చేయూత పథకాన్ని గత ఏడాది ప్రారంభించిన విషయం తెలిసిందే.

గత ఏడాది పథకం కింద లబ్ధిపొందిన మహిళల్లో అర్హత ఉన్నవారి వివరాలు అప్‌లోడ్ చేశారు. ఈ ఏడాది కొత్తగా 45 ఏళ్ల నిండిన వారు అర్హత సాధించారు. వీరిలో ఇంతవరకు అనేక మంది వివరాలను యాప్‌లో నమోదుచేశారు. మిగిలిన వారివివరాలను ఈ నెల 11వ తేదీలోగా నమోదు చేయాలని సచివాలయాల సిబ్బందిని ఆదేశించారు. చేయూత పథకం కోసం రూపొందించిన యాప్‌ను శుక్రవారం వరకు అందుబాటులో ఉంచనున్నట్టు సమాచారం వచ్చింది. అయితే ఇప్పటికే రాష్ట్రంలో అనేక చోట్ల ఆధార్ కేంద్రానికి జనం పోటెత్తుతున్నారు. వేలాది మంది ప్రజలు తరలిరావడంతో కేంద్రాల వద్ద జాతర వాతావరణం ఏర్పడింది. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు ఆధార్ అప్‌డేట్ హిస్టరీ తప్పనిసరి కావడంతో ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవడానికి ప్రతీ రోజూ ఒక్కో కేంద్రానికి 700 నుంచి 900 మంది ప్రజలు ఆధార్ కేంద్రానికి తరలివస్తున్నారు. కరోనా భయాన్ని కూడా లెక్క చేయకుండా వారు వస్తున్నారు.

ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన ప్రజలు తెల్లవారుజాము నుంచి ఆధార్ కేంద్రం వద్ద పడిగాపులు కాస్తున్నారు. తెల్లవారుజాము నుంచి అర్ధ రాత్రి వరకు ఆధార్ కేంద్రం నిర్వాహకులు పనిచేస్తున్నారు. కర్ఫ్యూ సమయం కావడంతో తినడానికి, తాగడానికి ఏమీ దొరక్క ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఈ క్రమంలో నేటి వరకు గడువు పొగింపును మరో వారం రోజులు పెంచాలని మారుమూల గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana.
Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110